
PRABHATA SURYA
ప్రభాత సూర్య
తెలుగు దిన పత్రిక
www.suryaa.news
వేల రూ.5/ - పేజీలు : 8 శనివారం 28 జూన్ 2025 సంపుటి: 01, సంచిక : 51
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## భారత్‌లో సంపన్నులు 55శాతం పెరగొచ్చు

భారత్‌లో ఓ వైపున పేదలు, మధ్య తరగతి ప్రజల ఆదాయాల్లో పెద్ద పురోగతి లేకపోగ.. అధిక ధరలతో ఉన్న ఆదాయాలు తరిగిపోతున్నాయి. మరోవైపు ధనవంతులు మరింత సంపన్నులు అవుతున్నారు. ఐదేండ్లలో దేశంలో సంపన్నులు రెట్టింపు కానున్నారని బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఆ వివరాలు.. 2024-2029 మధ్య భారత్‌లో సంపన్నుల జనాభా 55 శాతానికి పైగా పెరుగుతుందని అంచనా. ఇది ప్రపంచ సగటు 21 శాతంతో పోల్చితే రెట్టింపు కావడం విశేషం. 2023, 2024లో భారత ఆర్థిక సంపద 10.8 శాతం పెరిగింది. ఆసియా-పసిఫిక్ సగటు 7.3 శాతంగా ఉంది.

విలేకరులు కావలెను
సీనియర్ జర్నలిస్టుల సారథ్యంలో వస్తోన్న జాతీయ తెలుగు దినపత్రిక 'సూర్య' కి నిబద్ధత కలిగిన యువ, నవతరం కలం యోధులు కావాలి.
96667 32777
ప్రభాత సూర్య
www.suryaa.news



# వరి ఉత్పత్తిలో తెలంగాణ టాప్

### రాష్ట్రంలో తగ్గిన కూరగాయల సాగు

### పప్పు దినుసులు, పసుపు, మామిడిలోనూ తగ్గుదల

### వ్యవసాయ, అనుబంధ రంగాల స్థూల ఉత్పత్తి విలువలో 11వ స్థానం

### కేంద్ర గణాంకశాఖ నివేదిక

సూర్య హైదరాబాద్

దేశవ్యాప్తంగా వ్యవసాయ, అనుబంధ రంగాల స్థూలఉత్పత్తి విలువలో తెలంగాణ 11వ స్థానంలో నిలిచింది. అన్నిరకాల ధాన్యాల ఉత్పత్తి విలువలో నాలుగో స్థానంలో నిలవగా.. వరి ఉత్పత్తిలో మొదటి స్థానంలో నిలిచింది. చిరుధాన్యాలు, పప్పు దినుసులు, నూనెగింజలు, పండ్లు, కూరగాయలు, పశుసంపదలో ఇప్పటికీ వెనుకబడి ఉంది. 13 ఏళ్లలో వరిలో 3 రెట్ల వృద్ధి నమోదు చేసింది. అయితే అన్ని రకాల ధాన్యాల ఉత్పత్తిలో ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, మధ్యప్రదేశ్ దేశంలో అగ్రస్థానాల్లో కొనసాగుతున్నాయి. ఈ మేరకు దేశవ్యాప్తంగా 2011-12 నుంచి 2023-24 వరకు వ్యవసాయ, అనుబంధ రంగాల ఉత్పాదక విలువపై కేంద్ర గణాంకశాఖ నివేదిక విడుదల చేసింది. దేశ స్థూల ఆర్థికవ్యవస్థలో వ్యవసాయ, అనుబంధ రంగాలు దాదాపు 18 శాతం వాటాతో ఆహార భద్రత కల్పించడంతోపాటు ఆర్థిక వ్యవస్థ బలోపేతం, ఉపాధి కల్పన, ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తున్నాయని తెలిపింది. అయితే గత 13ఏళ్లలో ఈ వాటా 18.5 శాతం నుంచి స్వల్పంగా తగ్గి 17.8 శాతానికి చేరినట్లు పేర్కొంది. వ్యవసాయేతర రంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, వ్యవసాయం కేంద్రంగా ఉపాధికల్పన, గ్రామీణ జీవనోపాధికి ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు వ్యవసాయ ఆధునికీకరణ చేపట్టాల్సిన అవసరముందని సూచించింది. నివేదికలోని ముఖ్యాంశాలివి.. 2023-24లో రాష్ట్రంలో వ్యవసాయ, అనుబంధ రంగాల విలువ రూ.1.12 లక్షల కోట్లుగా వెల్లడైంది. కూరల్లో వినియోగించే టమోటా, ఉల్లిపాయ సాగు పడిపోయింది. 2011-12 నుంచి 2023-24 వరకు కూరగాయలు, పండ్ల ఉత్పత్తి విలువ రూ.10,357 కోట్ల నుంచి రూ.3,933.89 కోట్లకు తగ్గింది. దేశవ్యాప్తంగా వీటి విలువ పెరుగుతుం డటం గమనార్హం. పత్తి, జూట్ ఇతర నార ఉత్పత్తుల విలువలో రాష్ట్ర వాటా - మిగతా2లో




## అంతరిక్షం నుంచి భారత్

- గత 41 ఏళ్లలో స్పష్టమైన మార్పు
- విపరీతంగా పెరిగిన పట్టణీకరణ
- రాత్రిపూట చిత్రీకరించిన శాటిలైట్ ఫొటోలతో గుర్తింపు



## కదిలిన జగన్నాథుని రథ చక్రాలు

- వేడుకగా విశ్వప్రసిద్ధ రథయాత్ర
- భక్తజన సంద్రంగా పూరీ



## 13 రోజులైనా కేరళలోనే యూకే యుద్ధ విమానం

- రానున్న 40 మంది నిపుణుల బృందం
- ప్రత్యేక టో వాహనాన్ని పంపిన యూకే

# ఐఏఎంసీకి భూకేటాయింపు చెల్లదు



- కంపెనీల చట్టం కింద నమోదుకాని సంస్థకు ప్రభుత్వం నుంచి ఉచిత భూమి పొందే అర్హత లేదు
- ఐఏఎంసీకి భూకేటాయింపుపై దాఖలైన పిల్‌లపై హైకోర్టు ధర్మాసనం కీలక తీర్పు
- భూమిని ట్రస్టు విక్రయించుకోవచ్చన్న నిబంధన చట్ట విరుద్ధం
- అందువల్ల 3.70 ఎకరాల భూకేటాయింపును రద్దు చేస్తున్నాం.. జీవోను కొట్టేస్తున్నాం

సూర్య హైదరాబాద్

ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ)కు 2021లో రాష్ట్ర ప్రభుత్వం చేసిన భూకేటాయింపును హైకోర్టు శుక్రవారం రద్దు చేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం రాయదుర్గ్ సర్వే నంబర్83/1లో 3.70 ఎకరాలను కేటాయిస్తూ జారీ చేసిన జీవో 126ను జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ కె.సుజనా ధర్మాసనం కొట్టేస్తూ తీర్పు చెప్పింది. ఐఏ ఎంసీ ఒప్పందంలో భాగంగా ట్రస్టు బోర్డుకు ఆస్తులను విక్రయించే అధికారం - మిగతా2లో



# బిల్లుల విడుదల నిర్ణయం భేష్

### భట్టికి ఉద్యోగుల ఐకాస కృతజ్ఞతలు


సూర్య హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారుల వైద్యఖర్చుల బిల్లులకు రూ.180.38 కోట్లు విడుదల చేసిన సందర్భంగా ఉద్యోగ సంఘాల ఐకాస నేతలు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ప్రజాభవన్‌లో వారు డిప్యూటీ సీఎంను - మిగతా2లో

# సంక్షోభంలో సాగునీటి రంగం

### మాజీ మంత్రి హరీశ్‌రావు

### ప్రాజెక్టుల్లో ప్రమాదాలు కిషన్‌రెడ్డికి కనిపించడం లేదా?



సూర్య హైదరాబాద్

తెలంగాణ సాగునీటి రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభంలోకి నెడుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రంలో సాగు నీటి ప్రాజెక్టుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ రంగానికి కేసీఆర్ అత్యంత ప్రాధాన్యతనిచ్చి బాగు చేస్తే, ప్రాజెక్టులను పడావు పెట్టి, నిర్వహణ గాలికి వదిలి ఏపీకి నీళ్లు వదులుతున్న ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి - మిగతా2లో



## మూడు విడతల్లో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్

- నేటి నుంచి ప్రారంభం
- జులై 1 నుంచి ధ్రువపత్రాల పరిశీలన
- 6 నుంచి వెబ్ ఆప్షన్లు.. షెడ్యూల్ ఖరారు

సూర్య హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలల్లో బీటెక్ సీట్ల భర్తీకి ఎప్‌సెట్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం నుంచి ప్రారంభం కానుంది. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా మూడు విడతల్లో జరగనుంది. ఆగస్టు 18 నుంచి కళాశాలల్లో బ్రాంచీలు మార్చుకునే స్లైడింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఉన్నత విద్యామండలి - మిగతా2లో

# భూభారతిలో డిజిటల్ సమస్య

- సిబ్బంది అవగాహనలేమితో కొత్త ఇబ్బందులు
- డిజిటల్ సంతకాలు చేసే విషయంలో గందరగోళం
- పాత పట్టాదారు పేరు మీదనే డిజిటల్ సంతకాలు వస్తున్న వైనం
- ఐదు రోజులుగా నెమ్మదిగా సాగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
- నాలుగు రోజుల్లో సర్దుకుంటుందంటున్న అధికారులు




సూర్య హైదరాబాద్

భూభారతి పోర్టల్‌లో సాంకేతిక సమస్యలు ప్రారంభమయ్యాయి. వీటికి తోడు కొన్ని సమస్యలకు పరిష్కారం చూపడంలో సిబ్బంది అవగాహన లేమి ఇబ్బందులు తెచ్చి పెడుతోంది. వ్యవసాయ భూములపై కోర్టులు ఇచ్చే తీర్పులు అమలుచేసే సమయంలో ఎంచుకోవాల్సిన ఆప్షన్ల విషయంలో కొందరు రెవెన్యూ అధికారులు గందరగోళానికి గురవుతున్నారు. దీంతో కొత్తగా దరఖాస్తు చేసినా పాత పట్టాదారు పేరు మీదనే డిజిటల్ సంతకాలు వస్తున్నాయని తెలుస్తోంది. ఈ దరఖాస్తుల పరిష్కారంలో భాగంగా తహసీల్దార్ల డిజిటల్ సంతకం వరకు సాఫీగానే - మిగతా2లో

# ఐఏఎంసీకి భూకేటాయింపు చెల్లదు

-మొదటిపేజీ తరువాయి

ఉంటుందంటూ ఒక ముఖ్యమైన నిబంధన క్లాజ్ 6 (డీ)ను చేర్చడాన్ని ఉన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పు బట్టింది. తెలంగాణ భూ రెవెన్యూ చట్టం 1317 ఫస్లీ, ప్రైవేట్ సంస్థలకు ఇచ్చిన భూమికి మార్కెట్ విలువ చెల్లింపును తప్పనిసరి చేసే ఏపీ ఏలియనేషన్ ఆఫ్ స్టేట్ ల్యాండ్స్ రూల్స్%–%1975ను ఈ భూ కేటాయింపు ఉల్లంఘించిందని స్పష్టం చేసింది. ఐఏఎంసీ చట్ట బద్ధమైన సంస్థగా కంపెనీల చట్టం కింద నమోదు కాలేదని.. అందువల్ల ఉచిత భూమికి అనర్హమైనదిగా పరిగణించాల్సిందేనని తేల్చిచెప్పింది. గత నాలుగేళ్లలో ఐఏఎంసీ పనితీరు ఆశాజనకంగా లేదంటూ సంస్థ భవిష్యత్తుపై హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది.

ఈ ఏడాది జనవరి 29 నాటికి 15 ఆర్బిట్రేషన్ కేసులనే ఐఏఎంసీ నిర్వహించిందని (అందులో 11 అనుకూలంగా)... 57 మధ్యవర్తిత్వ కేసుల్లో 17 మాత్రమే అనుకూలంగా నిర్వహించిందని హైకోర్టు అభిప్రాయ పడింది. అయితే ఐఏఎంసీకి నిర్వహణ ఖర్చుల నిమి త్తం ఏటా రూ. 3 కోట్ల మేర చెల్లింపులకు అనుమ తిస్తూ జారీ చేసిన జీవోలు 76, 365లను మాత్రం ధర్మాసనం సమర్థించింది. ప్రభుత్వ విధానపరమైన నిర్ణయంలో భాగంగా ఐఏఎంసీ లాంటి కొత్త సంస్థకు ఆర్థిక సాయం అందించినా.. ఓ ప్రైవేట్ సంస్థకు అది శాశ్వతంగా ఉండ కూడదని హితవు పలికింది. ఐదేళ్ల తర్వాత ఆర్థిక సాయాన్ని కొనసాగించాలా వద్దా? అనే విషయాన్ని ప్రభుత్వం పరిశీలించాలని తీర్పులో సూచించింది.

**ప్రజాప్రయోజన వ్యాజ్యాలు ఇవీ..**

ఐఏఎంసీ ట్రస్టుకు అత్యంత విలువైన ప్రాంతంలో రూ. వందల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ 2021 డిసెంబర్ 26న రాష్ట్ర ప్రభుత్వం జీవో 126 విడుదల చేసింది. అలాగే నిర్వహణ ఖర్చుల కింద ఏటా రూ. 3 కోట్ల ఆర్థిక సాయం అందించేందుకు జీవోలు 76, 365లను, కేసుల కేటాయింపునకు జీవో 6ను జారీ చేసింది. ఏఐఎంసీని 2021 డిసెంబర్ 18న నాటి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ ప్రారంభించారు. అయితే ఆ జీవోలను కొట్టేసి ప్రభుత్వం భూమిని స్వాధీనం చేసుకొనేలా ఆదేశించాలని కోరుతూ న్యాయవాదులు ఎ.వెంకట్రామిరెడ్డి, వ్యక్తిగత హోదాలో కోటి రఘునాథరావు వేర్వేరుగా 2023లో ప్రజాప్రయోజన వ్యాజ్యాల (పిల్)ను దాఖలు చేశారు.

ఓ ప్రైవేట్ ఆర్బిట్రేషన్ సెంటర్‌కు అత్యంత విలువ చేసే భూమిని ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందో ప్రభుత్వం వద్ద సమాధానం లేదన్నారు. ఇది తెలంగాణ అర్బన్ ఏరియాస్ (డెవలప్‌మెంట్) చట్టాన్ని ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. అలాగే ఐఏఎంసీకి నిర్వహణ ఖర్చుల కింద ఏటా రూ. 3 కోట్లను ప్రభుత్వం మంజూరు చేయడం ప్రజాధనాన్ని వృథా చేయడమే అవుతుందని.. ప్రభుత్వ నిర్ణయం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమన్నారు. ఈ పిల్‌లపై జనవరిలో వాదనలు ముగించిన జసిటస్ కె.లక్ష్మణ్, కె.సుజన ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది.

**వాదనలు సాగాయిలా..**

పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.సత్యంరెడ్డి వాదనలు వినిపిస్తూ.. 'రూ. 350 కోట్లకుపైగా విలువైన 3.70 ఎకరాల ప్రభుత్వ భూమిని ఉచితంగా ఐఏఎంసీకి కేటాయించడం రాష్ట్రానికి తీరని నష్టం. ఓ ప్రైవేట్ ట్రస్ట్‌కు నిబంధనలకు విరుద్ధంగా నిధులు కేటాయించడమే కాకుండా నిర్వహణ పేరిట ఏటా రూ. 3 కోట్ల నిధులు కేటాయించడం ప్రజాధనం దుర్వినియోగం చేయడమే. నిబంధనలకు, సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా ప్రైవేట్‌సంస్థకు భూకేటాయింపు జరిపారు' అని పేర్కొన్నారు. ఐఏఎంసీ తరఫున సీనియర్ న్యాయవాది డి.ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ప్రజాప్రయోజనాల కోసమే ప్రభుత్వం భూమి, నిధులు ఇచ్చిందన్నారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ 'ఐఏఎంసీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తే పలు అంతర్జాతీయ సంస్థల మధ్య వివాదాల పరిష్కారానికి దోహదపడుతుంది. ఇలాంటి వివాదాలు కేవలం న్యాయస్థానాల్లోనే కాకుండా బయట కూడా చేసుకోవచ్చని న్యాయస్థానాలే చెబుతున్నాయి. ఐఏఎంసీతో వివాదాలు పరిష్కారమైతే కోర్టులపైనా భారం తగ్గుతుంది. ఇందులో ప్రజాహితం ఉన్నందునే ప్రభుత్వం భూమి, నిధులు ఇవ్వాలనే నిర్ణయం తీసుకుంది. ఐఏఎంసీ ట్రస్ట్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయశాఖ మంత్రితోపాటు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు ట్రస్టీలుగా ఉన్నారు. ప్రభుత్వం కేటాయించిన నిధుల్లో ఒక్క రూపాయి దుర్వినియోగం కాలేదు' అని నివేదించారు.

**ఐఏఎంసీ తనను తాను నిలబెట్టుకోలేకపోయిందన్న ధర్మాసనం**

'ప్రభుత్వాల నుంచి నిరంతర ఆర్థిక సాయం పొందుతున్నప్పటికీ ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ ఆల్టర్నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్ (ఐసీఏడీఆర్) తన లక్ష్యాలను నెరవేర్చడంలో ఎలా విఫలమైందో మేము ఎత్తి చూపాలనుకుంటున్నాం. దేశంలో ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాన్ని ప్రోత్సహించడానికి 1995లో కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ ద్వారా ఐసీఏడీఆర్ ఒక రిజిస్టర్డ్ సొసైటీగా ఏర్పడింది. దాని ప్రారంభం నుంచి ఐసీఏడీఆర్ 49 మధ్యవర్తిత్వ కేసులనే స్వీకరించిందని ఉన్నతస్థాయి కమిటీ నివేదిక పేర్కొంది.

ఆర్థిక సహాయం ఉన్నా కేసుల పరిష్కారం నామమాత్రంగానే ఉన్నందున ఐసీఏడీఆర్‌ను స్వాధీనం చేసుకోవాలని.. దానికి మంజూరు చేసిన శాశ్వత లీజును రద్దు చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. ఐఏఎంసీ అలా మారదని మేము ఆశిస్తున్నాము. అయితే మూడేళ్లుగా ఏటా రూ. 3 కోట్ల ఆర్థిక సాయం, ఉచిత కార్యాలయ స్థలాన్ని అందించినా ఐఏఎంసీ తనను తాను నిలబెట్టుకోలేకపోయింది. ప్రభుత్వం ఆశించిన మేరకు భవిష్యత్తులో ఆర్థికంగా నిలదొక్కుకునే సంకేతాలను చూపించలేకపోయింది. ఐఏఎంసీ ప్రారంభానికి మద్దతు సమర్థనీయమే. కానీ అలాంటి సంస్థలకు నిరంతర, శాశ్వత ఆర్థిక సాయం రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా లాభదాయకం కాకపోవచ్చు. ఐఏఎంసీ పనితీరును ఏటా సమీక్షించి, దాని ఖాతాలను తెలంగాణ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఆడిట్) లేదా మరే ఇతర సమర్థ అధికారి ద్వారా ఆడిట్ చేయించుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తున్నాం. గత ఒప్పందం మేరకు ఐదేళ్ల తర్వాత ఐఏఎంసీ పనితీరుకు లోబడి నిధుల విడుదల ఉండేలా ప్రభుత్వం చూసుకోవాలి' అని ధర్మాసనం పేర్కొంది.

**నిధుల కేటాయింపునకు పనితీరే కొలమానం..**

'ప్రభుత్వ వివాదాలన్నీ ఐఏఎంసీలోనే పరిష్కరించుకునేలా ఇచ్చిన జీవో సమర్థనీయమే అయినా.. పలు సూచనలు చేయాల్సి ఉంది. రూ. 3 కోట్లకుపైగా విలువైన అన్ని వివాదాలను ఐఏఎంసీకి మధ్యవర్తిత్వం కోసం సూచించాలనే ప్రభుత్వ నిర్ణయం విధానపరమైనది. అయితే ప్రజాధనంతో ఈ అంశం ముడిపడి ఉన్నందున జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రభుత్వం కేసులను ఐఏఎంసీకి సూచించడం, దానికయ్యే ఖర్చులను పరిశీలించాల్సి ఉంటుంది. ఐఏఎంసీ ద్వారా మధ్యవర్తిత్వ ఖర్చు ఎక్కువగా ఉందని.. ఖజానాపై గణనీయమైన భారం పడుతున్నట్లు గురిస్తే ప్రభుత్వం నిర్ణయం మార్చుకోవచ్చు. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి తర్వాత పిల్‌లను పాక్షికంగా అనుమతిస్తున్నాం' అని ధర్మాసనం తెలిపింది.

**మధ్యవర్తిత్వాన్ని బలోపేతం చేయాలి..**

'కేంద్ర న్యాయ శాఖ జస్టిస్ బీఎన్ శ్రీకృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాన్ని ప్రోత్సహించడానికి దేశంలో సంస్థాగత మధ్యవర్తిత్వాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది. మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించాలన్న లక్ష్యాన్ని సాధించడానికి ఐసీసీ కోర్టు, సింగపూర్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్ (ఎస్ఐఏసీ), లండన్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ (ఎల్‌సీఐఏ), హాంకాంగ్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ సెంటర్ (హెచ్‌కెఐఏసీ)ల మాదిరిగానే మధ్యవర్తిత్వ సేవలను అందించే సంస్థలను స్థాపించాలని సిఫార్సు చేసింది. సంస్థాగత మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించడంలో ప్రభుత్వ మద్దతు ప్రాముఖ్యతను వివరించింది. ప్రధాన వాణిజ్య కేంద్రాల్లో సమగ్ర మౌలిక సదుపాయాలను ప్రభుత్వాలు సులభతరం చేయాలని కమిటీ సిఫార్సు చేసింది. మధ్యవర్తిత్వ సంస్థల నిర్వహణకు ప్రారంభ మూలధనం అవసరమని.. దాన్ని ప్రభుత్వం అందించవచ్చని పేర్కొంది. మధ్యవర్తిత్వ సంస్థలకు ప్రభుత్వాలు మద్దతివ్వడం సంతృప్తికరమే' అని హైకోర్టు ధర్మాసనం పేర్కొంది.

# సంక్షోభంలో సాగునీటి రంగం

-మొదటిపేజీ తరువాయి

ఇప్పటికైనా కళ్లు తెరిచి మేడిగడ్డపై దుష్ప్రచారం మానుకోవాలని, ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఏడాదిన్నర పాలనలో జరిగిన ప్రాజెక్టుల ప్రమాదాలు.. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం అంటూ శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హరీశ్‌రావు విమర్శించారు. 'ఖమ్మంలో పెద్దవాగు కొట్టుకుపోయింది. నల్లగొండలో సుంకిశాల కుప్ప కూలింది. పాలమూరులో వట్టెం పంప్ హౌస్ జలమయమైంది. నల్లగొండలో ఎస్ఎల్‌బీసీ కుప్పకూలింది. జూరాల ప్రాజెక్టు గేట్ల రోప్స్ తెగిపోయాయి. మంజీర డ్యామ్ ఆప్రాన్ వరద ధాటికి కొట్టుకుపోగా, పియ్యర్స్‌లలో పగుళ్లు వచ్చాయి. కాంగ్రెస్ చేతగానితనం వల్లే ఈ ప్రమాదాలు జరిగినా ఎన్‌డీఎస్ఏకు కనిపించవు'అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిన వెంటనే ఎన్‌డీఎస్ఏకు లేఖ రాసిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన ప్రమాదాలు కనిపించడం లేదని ధ్వజమెత్తారు. బనకచర్ల ద్వారా ఏపీకి నీళ్లు తరలించే కుట్ర జరుగుతోందని అన్నారు. రాజకీయ ఎజెండాల కోసం తెలంగాణకు ప్రాణాధారం అయిన సాగునీటి రంగాన్ని బలి చేయొద్దని హరీశ్‌రావు హితవు పలికారు.

కాగా, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నరలో జరిగిన 142 మంది ఆటో కార్మికుల



ఆత్మహత్యలు కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలేనని ఆయన విమర్శించారు. పటాన్‌చెరు ఆటోడ్రైవర్ల సంఘం ప్రతినిధులు శుక్రవారం హరీశ్‌రావును ఆయన నివాసంలో కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో కార్మికుల జీవితం దయనీయంగా మారిందని వారు ఆయనకు వినతిపత్రం ఇచ్చారు. సీఎం రేవంత్ ఆటో కార్మికులకు భద్రత కల్పించాలని హరీశ్ డిమాండ్ చేశారు.

# మరి ఇంత చిల్లర పాలనా..?
# రేవంత్ సర్కార్‌పై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ సీనియర్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయంలో దళితుల పట్ల చూపిస్తున్న వివక్షపై ఆర్ఎస్పీ మండిపడ్డారు. మంచిర్యాల జిల్లా భీమారం మండలం పోలంపల్లికి చెందిన నక్క సనా, వేణు దంపతులకు ఇందిరమ్మ ఇల్లు ప్రొసీడింగ్‌ను ఆపేసిన ఘటనపై ఆర్ఎస్పీ తీవ్రంగా స్పందించారు. అంటే మీ ఏఐ లాంగ్వేజ్ మోడల్‌లో వాట్సాప్‌లో బీఆర్ఎస్ స్టాటస్ పెట్టుకుంటే, ఎస్సీలైతే ఇందిరమ్మ ఇల్లు ఇవ్వనవసరం లేదని షరతులు విధించి ప్రోగ్రాం తయారు చేసింద్రన్న మాట! మరీ ఇంత చిల్లర పాలనా? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీతోపాటు కేసీఆర్ ఫొటో వాట్సాప్ స్టేటస్ పెట్టినందుకు బుధవారం మంత్రి వివేక్ నిర్వహించే కార్యక్రమంలో తనకు ఇవ్వాల్సిన ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్‌ను ఆపేసినట్టు మంచిర్యాల జిల్లా భీమారం మండలం పోలంపల్లికి చెందిన నక్క సనా %–% వేణు దంపతులు ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం ఉదయం పోలంపల్లిలోని తమ గుడిసె ముందు మాట్లాడారు. ఎస్సీ మాదిగ అయినందునే వివక్ష చూపి ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్ ఇవ్వలేదని ఆరోపించారు. ఈ విషయమై ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి పంచాయతీ కార్యదర్శి




సృజనను కలిస్తే.. మంత్రి పీఏ ప్రొసీడింగ్ ఆపేయమని చెప్పారని, బీఆర్ఎస్ స్టేటస్‌లు ఎందుకు పెడుతున్నారని పంచాయతీ కార్యదర్శి పేర్కొనడంతో వారు కంగుతిన్నారు. వాట్సాప్ స్టేటస్ పెట్టడం వల్లే మంత్రి పీఏకు ఫిర్యాదు వెళ్లిందని, అందుకే ప్రొసీడింగ్ ఇవ్వడం లేదని ఆమె తెలిపినట్టు వారు వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం అర్హులందరికీ ఇందిరమ్మ ఇవ్వాలని చెప్తున్నారని, ప్రజాపాలన అంటే ఇదేనా? అని వారు ప్రశ్నించారు. ప్రొసీడింగ్ ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు.

## వరి ఉత్పత్తిలో తెలంగాణ టాప్

-మొదటిపేజీ తరువాయి

9.3 నుంచి 13 శాతానికి పెరిగింది. మసాలా దినుసుల ఉత్పత్తిలో ఏపీతో సమానంగా రెండింతల వృద్ధిని తెలంగాణ నమోదు చేసింది. గతంలో పసుపు విలువ రూ.1,132.85 కోట్లుగా ఉంటే.. ఇప్పుడది రూ.426.43కి తగ్గింది. పప్పుధాన్యాల ఉత్పత్తి, ఉత్పాదక విలువ పడిపోయాయి. మూడేళ్ల క్రితం వరకు రూ.1,883 కోట్లు ఉంటే.. ఇప్పుడు రూ.1,176 కోట్లకు చేరింది. నూనెగింజలకు సంబంధించి వేరుసెనగ ఉత్పత్తి తగ్గిపోయింది. అలాగే చెరకు ఉత్పాదకత విలువ పడిపోయింది. పదేళ్ల క్రితం అది రూ.610.14 కోట్లు ఉంటే.. ప్రస్తుతం రూ.375.58 కోట్లకు చేరింది. మామిడి ఉత్పాదకత విలువ రూ.1,986.46 కోట్ల నుంచి రూ.1,314.92 కోట్లకు తగ్గింది. ద్రాక్ష, నిమ్మ తోటల పరిస్థితి అలాగే ఉంది. టమోటా ఉత్పాదకత విలువ గతంలో రూ.3,519 కోట్లు ఉంటే ఇప్పుడది రూ.435 కోట్లకు తగ్గింది. మాంసం ఉత్పత్తి విలువ రూ.9,224 కోట్ల నుంచి రూ.24,507 కోట్లకు పెరిగింది. గుడ్ల ఉత్పత్తి విలువ రూ.1,933.49 కోట్ల నుంచి రూ.3,964.52 కోట్లకు చేరింది. దేశంలో ఆర్థిక వ్యవస్థ విలువ రూ.274.13 లక్షల కోట్లు ఉంటే.. వ్యవసాయ, అనుబంధ రంగాల విలువ రూ.48.78 లక్షల కోట్లుగా ఉంది. గత 13 ఏళ్లలో ఈ రంగాలు 225% వృద్ధి నమోదు చేశాయి. 2011–12లో రూ.15.02 లక్షల కోట్లు ఉంటే.. 2023–24 నాటికి రూ.48.78 లక్షల కోట్లకు చేరింది.

## మూడు విడతల్లో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్

-మొదటిపేజీ తరువాయి

కార్యాలయంలో ఎప్‌సెట్ ప్రవే శాల కమిటీ ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టారెడ్డి, కన్వీనర్, రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ప్రవేశాల కౌన్సెలింగ్ షెడ్యూలును ఖరారు చేశారు. ఫీజులకు సంబంధించిన అంశంపై ప్రభుత్వానికి లేఖ రాయాలని, అక్కడి నుంచి వచ్చే సమాచారం ఆధారంగా ముందుకెళ్లాలని నిర్ణయించారు. సమావేశం అనంతరం ప్రవేశాల కమిటీ కన్వీనర్ శ్రీదేవసేన షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఉన్నత విద్యామండలి కార్యదర్శి ఆచార్య శ్రీరాం వెంకటేష్, జేఎన్‌టీయూహెచ్ రెక్టార్ ఆచార్య విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య కె.వెంకటేశ్వర్‌రావు, ఎప్‌సెట్ కన్వీనర్ ఆచార్య డీన్‌కుమార్, ఓయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చంద్రశేఖర్, ప్రవేశాల క్యాంపు అధికారి బి.శ్రీనివాస్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

**తొలిసారి మాక్ సీట్ల కేటాయింపు**

ఉన్నత విద్యా మండలి తొలిసారిగా మాక్ సీట్ల కేటాయింపు ప్రక్రియను ఈసారి ప్రవేశపెట్టింది. అందులో సీట్లు పొందిన తర్వాత అవసరమైతే వెబ్ ఆప్షన్లు మార్చుకోవచ్చు.

తొలి విడతలో సీట్లు పొందిన విద్యార్థులు మెరుగైన కళాశాల, మెరుగైన బ్రాంచి కోరుకునే పక్షంలో రెండో విడతలో మళ్లీ వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి. రెండో విడత సీట్ల కేటాయింపు తర్వాత విద్యార్థులు తప్పనిసరిగా ఆయా కళాశాలల్లో స్వయంగా రిపోర్ట్ చేయాలి. ఆ సమయంలో ఒరిజినల్ టీసీ సమర్పించాలి. మిగిలిన విద్యార్హత ధ్రువపత్రాలు జిరాక్స్‌వి సమర్పిస్తే సరిపోతుంది.

రెండో విడత కౌన్సెలింగ్ వరకు సీట్లను రద్దు చేసుకోవచ్చు. చెల్లించిన ఫీజు మొత్తం వెనక్కి ఇస్తారు. చివరి విడతలో అలాంటి అవకాశం ఉండదు. ఫీజు తిరిగి ఇవ్వరు.

గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో మిగిలిపోయిన సీట్లకు స్పాట్ ప్రవేశాలు జరుపుకొనే వెసులుబాటు ఉంటుంది. అందుకు సంబంధించిన మార్గదర్శకాలను ఆగస్టు 23వ తేదీన వెబ్‌సైట్‌లో ఉంచుతారు.

## భూభారతిలో 'డిజిటల్' సమస్య

-మొదటిపేజీ తరువాయి

సాగుతోందని, ఆ తర్వాత జరగాల్సిన అప్‌డేషన్ జరగడం లేదని సమాచారం. రికార్డుల్లో పేరు మార్పు జరగడం లేదని చాలా కాలంగా రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోని చాలా చోట్ల ఇలాంటి సమస్యలు వస్తున్నాయి. అయితే, ఈ కోర్టు కేసుల అమలు విషయంలో డిజిటల్ సంతకాలు చేసే సమయంలో ఆర్డీఓలు ఆప్షన్ ఎంచుకోవాల్సి ఉంటుందని, పట్టాదారు మారుతున్నాడనే ఆప్షన్‌ను ఎంచుకుంటేనే కొత్త పట్టాదారుకు ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్‌కు అవకాశం వస్తుందని, లేదంటే పాత పట్టాదారు పేరు మీదనే ప్రక్రియ పూర్తయినట్టు చూపిస్తోందని సమాచారం. ఈ నేపథ్యంలో తాజాగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన భూభారతి సదస్సుల్లో 20 వేలకు పైగా కోర్టు కేసులు/పెండింగ్ మ్యుటేషన్ దరఖాస్తులు వచ్చాయని రెవెన్యూ వర్గాలు చెపుతున్నాయి. కోర్టు కేసులను పరిష్కరించే లాగిన్ ఉన్న ఆర్డీఓలు డిజిటల్ సంతకాలు చేసే సమయంలో ఆప్షన్లను సరిగా ఎంచుకోవాల్సి ఉంటుందని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

**నెమ్మదిగా రిజిస్ట్రేషన్లు..**

గత ఐదు రోజులుగా భూభారతి పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్లు నెమ్మదిగా జరుగుతున్నాయి. స్లాట్ బుకింగ్ సవ్యంగానే జరుగుతున్నా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం నుంచి పూర్తయ్యేంత వరకు సర్వర్ నెమ్మదిగా సాగుతోందని రెవెన్యూ వర్గాలంటున్నాయి. డిజిటల్ సంతకాలు, డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేసే సమయంలో ఎక్కువ సమయం తీసుకుంటోందని.. దీంతో 15%–%20 నిమిషాల్లో పూర్తయ్యే ప్రక్రియకు 40%–%45 నిమిషాలు పడుతోందని చెబుతున్నారు. ఈ విషయంపై హైదరాబాద్‌లోని మెయిన్ సర్వర్ కార్యాలయాన్ని సంప్రదించగా సాంకేతిక సమస్య ఉందని, నాలుగైదు రోజుల్లో సర్దుకుంటుందని చెబుతున్నారు. పోర్టల్ అప్‌డేట్ అవుతున్న సందర్భంలో కొన్ని సమస్యలు వస్తాయని, వాటంతట అవే సర్దుకుంటాయని చెబుతున్నట్లు సమాచారం.

## బిల్లుల విడుదల నిర్ణయం భేష్

-మొదటిపేజీ తరువాయి

కలిశారు. సమస్యలను విన్నవించిన కొద్దిరోజులకే బిల్లులకు నిధులు విడుదల చేయడంతో పాటు, మహిళా శిశుసంక్షేమ శాఖ, ప్రణాళిక శాఖల్లో కొత్త ఉద్యోగాలను మంజూరుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం, ఉద్యోగుల వైద్యబీమా పథకం, ప్రమోషన్లకు చర్యలు తీసుకోవడంపై హర్షం వ్యక్తంచేశారు.

## యువ ఇన్నోవేటర్స్‌ను ప్రోత్సహించేలా హైడియాథన్ స్టార్టప్ కాంపిటీషన్

తెలంగాణ ప్రభుత్వ డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ (డీట్) గుర్తింపు ఫౌండేషన్, వీవ్ మీడియా ఆధ్వర్యంలో ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్ హైడియాథన్ స్టార్టప్ కాంపిటీషన్ జరగనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా హైడియాథన్ పోస్టర్ లాంచ్ స్థానిక డీట్ ఆఫీసు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. పోస్టర్ ఆవిష్కరణలో డీట్ డైరెక్ట్ ఈ ఆర్ జనార్దన్ రెడ్డి , అడిషనల్ డైరెక్టర్ పీఆర్ వంశీ, వీవ్ మీడియా టీం లాంచ్ చేశారు. వీ హబ్ సీఈఓ సీత చేతుల మీదుగా వీ హబ్‌లో లాంచింగ్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 18–30 ఏళ్ల వయసు మధ్యలో ఉన్న కాలేజ్ స్టూడెంట్స్, యువ ఇన్నోవేటర్స్ ఈ కాంపిటీషన్ పాల్గొనవచ్చని ఫౌండేషన్ డైరెక్టర్ నరేంద తెలిపారు. విజేతలకు ప్రైజ్ మనీతో పాటు , అప్ స్కిల్లింగ్, ఇంకుబేషన్ సపోర్ట్, ఫండింగ్ సపోర్ట్ అందిస్తున్నామని 'గుర్తింపు ఫౌండేషన్' డైరెక్టర్ నరేంద తెలిపారు.

# అంతరిక్షం నుంచి భారత్

న్యూఢిల్లీ

అంతరిక్షంలోకి వెళ్లిన తొలి భారతీయుడిగా రాకేశ్ శర్మ రికార్డుకెక్కారు. 1984 ఏప్రిల్‌లో ఆయన అంతరిక్ష యాత్ర చేశారు. వారం రోజుల్లో భూమిపైకి తిరిగొచ్చారు. అంతరిక్షం నుంచి మన దేశం ఎలా కనిపిస్తోంది? అని అప్పటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ప్రశ్నించగా.. 'సారే జహాఁసే అచ్ఛా'అటూ రాకేశ్ శర్మ బదులిచ్చారు. ఒకవేళ ఆయన ఇప్పుడు అంతరిక్షంలోకి వెళ్లి ఉంటే అప్పట్లో చూడని ఎన్నో దృశ్యాలు తిలకించేవారు. ముఖ్యంగా రాత్రిపూట మన ఇండియా ఎలా కనిపిస్తోందో వెల్లడించేవారు. ప్రస్తుతం ఆ అవకాశం శుభాన్షు శుక్లా దక్కింది. ఆయన గురువారం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. 1984 నుంచి గమనిస్తే.. గత 41 ఏళ్లలో మన దేశం ఎంతగానో పురోగమించింది. పట్టణీకరణ విపరీతంగా పెరిగింది. రాత్రి సమయంలో చిత్రీకరించిన ఉపగ్రహ చిత్రాలు 2000 సంవత్సరం నుంచి విస్తృతంగా అందుబాటులోకి వచ్చాయి. అంతకంటే ముందున్న శాటిలైట్ కెమెరాలు ఆధునికమైనవి కావు. రాత్రి సమయంలో ఫొటోలను స్పష్టంగా చిత్రీకరించే సామర్థ్యం వాటికి లేదు. ప్రస్తుతం అడ్వాన్స్‌డ్ శాటిలైట్ కెమెరాలు అంతరిక్షం నుంచి ప్రతి దేశాన్ని స్పష్టంగా మన కంటికి చూపగలుగుతున్నాయి. రాత్రిపూట దేదీప్యమానంగా వెలిగే విద్యుత్ దీపాలను బట్టి ఆయా ప్రాంతాల అభివృద్ధిని అంచనా వేయొచ్చు. దేశ ప్రగతితోపాటు సామాజిక, ఆర్థిక మార్పులను ఇవి కొంతవరకు ప్రతిబింబిస్తాయనడంలో సందేహం లేదు.



**విద్యుత్ కాంతి విస్తృతి**

ఇండియాలో పట్టణీకరణ, అభివృద్ధి ఏ మేరకు జరిగిందో తెలుసుకొనేందుకు శాటిలైట్ చిత్రాల ద్వారా భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో)కు చెందిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్సీ) ఒక అధ్యయనం చేసింది. 2012 నుంచి 2021 వరకు రాత్రి సమయంలో అంతరిక్షం నుంచి ఉపగ్రహాలు చిత్రీకరించిన ఫొటోలు సేకరించి, విశ్లేషించింది. పదేళ్లలో దేశంలో రాత్రిపూట విద్యుత్ కాంతి(నైట్‌టైమ్ లైట్) విస్తృతి ఏకంగా 43 శాతం పెరిగినట్లు తేలింది. ముఖ్యంగా బిహార్, మణిపూర్, లద్దాఖ్, కేరళలో ఈ విస్తృతి అధికంగా ఉండడం విశేషం. 2020 సంవత్సరంలో చాలా రాష్ట్రాల్లో తగ్గిపోయింది. ఇందుకు కోవిడ్%-%19 మహమ్మారి వ్యాప్తి కారణమని చెబుతున్నారు. 1984 నాటి చిత్రాలను, ఇప్పటి చిత్రాలను గమనిస్తే 1990వ దశకంలో ఆర్థిక సంస్కరణలు మొదలైన తర్వాతే ఇండియాలో పట్టణీకరణ వేగం పుంజుకున్నట్లు స్పష్టమవుతోంది.

**అంతరిక్షం నుంచి భారత్ అద్భుతం**

ఇండియన్%-%అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో తొమ్మిది నెలలపాటు ఉండి, ఏప్రిల్‌లో భూమిపైకి తిరిగొచ్చిన సంగతి తెలిసిందే. అంతరిక్షం నుంచి ఇండియా అద్భుతంగా కనిపిస్తోందని ఆమె చెప్పారు. హిమాలయ పర్వతాలపై నుంచి వెళ్లినప్పుడల్లా అందమైన చక్కటి ఫొటోలు తీసుకున్నామని తెలిపారు. గుజరాత్, ముంబైలో సౌందర్యవంతంగా కనిపించాయని వెల్లడించారు

# కరాచీ టూ ఇండియా...వయా దుబాయ్



**ముంబై :** పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. భారత ప్రభుత్వం పాకిస్థాన్‌పై పలు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. ఎన్ని ఆంక్షలు ఉన్నప్పటికీ.. పాక్‌తో కొంతమంది దొంగతనంగా వ్యాపారం సాగిస్తున్నారు. తాజాగా నవీ ముంబైలోని పోర్టులో ఓ భారీ షిప్ వచ్చింది. అందులో ఏకంగా 39 భారీ కంటైనర్లు పాకిస్థాన్‌కు చెందినవిగా అధికారులు గుర్తించారు. పూర్తి వివరాలు చూస్తే.. అక్రమ వ్యాపారం నియంత్రణలో భాగంగా డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ నవీ ముంబైలోని నవా షెవా ఓడరేవులో పాకిస్తాన్ నుండి వచ్చిన వస్తువులతో నిండిన 39 కంటైనర్లను స్వాధీనం చేసుకుంది. 1,115 మెట్రిక్ టన్నులు ఉన్న ఈ కంటైనర్లు సుమారు రూ. 9 కోట్ల విలువైనవిగా అధికారులు అంచనా వేశారు. పాకిస్తాన్ నుండి దిగుమతి చేసుకుంటున్న నిషేధిత వస్తువులను థర్డ్ పార్టీ కంట్రీస్ నుంచి ఇండియాలోకి దిగుమతి చేసుకునే ప్రయత్నం జరిగింది. ప్రధానంగా దుబాయ్, యూఏఈ ద్వారా అడ్డుకునేందుకు "ఆపరేషన్ డీప్ మానిఫెస్ట్" అనే కోడ్‌నేమ్‌తో కూడిన ఈ హై-స్టేక్స్ ఆపరేషన్ ప్రారంభించారు అధికారులు. ఈ ఆపరేషన్‌లో భాగంగానే ఈ కంటైనర్లు పట్టుబడ్డాయి. ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటన ప్రకారం.. స్వాధీనం చేసుకున్న వస్తువులు భారతదేశ దిగుమతి విధానాన్ని స్పష్టంగా ఉల్లంఘించాయి, ఇది పాకిస్తాన్ మూలాల ఉత్పత్తులను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా దిగుమతి చేసుకోవడం, రవాణా చేయడాన్ని స్పష్టంగా నిషేధిస్తుంది. దిగుమతి చేసుకునే సంస్థ భాగస్వాములలో ఒకరిని గురువారం అరెస్టు చేసినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. పహల్గామ్ ఉగ్రవాద దాడుల తర్వాత, ప్రభుత్వం మే 2, 2025 నుండి పాకిస్తాన్‌లో ఉత్పత్తి అయిన లేదా ఎగుమతి చేసిన వస్తువుల ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా దిగుమతి చేసుకోవడం లేదా రవాణా చేయడంపై సమగ్ర నిషేధం విధించింది. గతంలో, అటువంటి వస్తువులు 200 శాతం కస్టమ్స్ సుంకానికి లోబడి ఉండేవిఅయితే ఇన్ని కఠినమైన ఆంక్షలు ఉన్నప్పటికీ కొంతమంది దిగుమతిదారులు వస్తువుల మూలాన్ని తప్పుగా పేర్కొని, సంబంధిత షిప్పింగ్ పత్రాలను తారుమారు చేస్తూ ప్రభుత్వాన్ని మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆరోపించింది. "రెండు వేర్వేరు సందర్భాలలో ఈ సరుకులను నవా షెవా పోర్టులో స్వాధీనం చేసుకున్నారు. ఈ సరుకులను జంఇ-మూలం అని తప్పుగా పేర్కొన్నారు. కానీ, నిజానికి అవి పాకిస్థాన్ వస్తువులు. భారతదేశంలోకి దిగుమతి చేసుకోవడానికి దుబాయ్ నుంచి వచ్చాయని దర్యాప్తులో తేలింది" అని ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రకటనలో పేర్కొంది. దర్యాప్తులో ఈ వస్తువులను మొదట పాకిస్తాన్ నుండి దుబాయ్‌కు ఒక సెట్ కంటైనర్లు, ఓడలపై రవాణా చేశారని, ఆ తర్వాత భారతదేశానికి వెళ్లే మరొక సెట్ కంటైనర్లు, ఓడలకు బదిలీ చేశారని తేలింది. ఇప్పటివరకు నిర్వహించిన దర్యాప్తులో సేకరించిన పత్రాల విశ్లేషణ, వస్తువులను మరింత పరిశీలించినప్పుడు పాకిస్తాన్‌లోని కరాచీ ఓడరేవు నుండి కార్గో తరలింపు మార్గాలు, దుబాయ్‌లోని జాబెల్ అలీ ఓడరేవు వద్ద భారత ఓడరేవులకు వెళ్లే మార్గంలో ట్రాన్స్‌షిప్‌మెంట్‌లు బయటపడ్డాయి. పాకిస్తాన్ సంస్థలతో డబ్బు బదిలీలు/ఆర్థిక సంబంధాలను కూడా అధికారులు గుర్తించారు. ఇది అక్రమ ఆర్థిక ప్రవాహాల గురించి తీవ్రమైన ఆందోళనలను రేకెత్తించింది. "ఈ మొత్తం కార్యనిర్వహణ విధానం పాకిస్తాన్, యూఏఈ జాతీయులతో కూడిన సంక్లిష్టమైన లావాదేవీల వెబ్ ద్వారా నిర్వహించారు. ఇది వస్తువుల నిజమైన మూలాన్ని, అంటే పాకిస్తాన్‌ను అస్పష్టం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది" అని ఆర్థిక మంత్రిత్వ శాఖ జోడించింది.

# రాహుల్, రేవంత్ టార్గెట్‌గా పీకే ఫైర్



**పాట్నా:** బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయం వేడెక్కింది. బీహార్ రాజకీయాల్లో జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ స్పీడ్ పెంచారు. అధికార నితీష్ కుమార్, కాంగ్రెస్‌ను టార్గెట్ చేసి తీవ్ర విమర్శలు, ఆరోపణలు చేశారు. తాజాగా లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి ప్రశాంత్ కిషోర్ సవాల్ విసిరారు. బీహార్ పట్ల రాహుల్‌కు ఉన్న నిబద్ధతను పీకే ప్రశ్నించారు. జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ తాజాగా ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. 'బీహార్‌లో అట్టడుగు వర్గాలతో మంచి సంబంధాలు ఉన్నాయని రాహుల్ గాంధీ చెప్పుకుంటున్నారు. బీహార్‌లోని గ్రామంలో ఒక్క రాత్రి రాహుల్ ఉండాలని సవాల్ చేస్తున్నాను. రాహుల్ రాష్ట్రానికి వస్తున్నారు.. పోతున్నారు. కానీ, ఎలాంటి యాత్రలు చేపట్టడం లేదు. రాహుల్ ఏదైనా ఒక గ్రామంలో ఒక్కరోజు ఉండగలిగితే.. ఆయన వ్యాఖ్యలను నేను అంగీకరిస్తాను. మీరు ఢిల్లీలో కూర్చుని.. బీహారీలను చూసి నవ్వండి. మాకు ఉపన్యాసాలు ఇవ్వడానికి మాత్రం ఇక్కడి రండి అని ఘాటు విమర్శలు చేశారు. ఇదే సమయంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కూడా పీకే టార్గెట్ చేసి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రశాంత్ కిషోర్ మాట్లాడుతూ.. తెలంగాణలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన ఆర్ఎస్ఎస్, బీజేపీ, టీడీపీతో సంబంధాలున్నాయి. చివరకు కాంగ్రెస్‌లో చేరి ముఖ్యమంత్రి కాగలిగారు. సీఎం అయిన తర్వాత ఆయన బీహారీలపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. శ్రమ చేయడం బీహారీల డీఎన్ఏలోనే ఉంది. బీహారీలు శ్రమ చేయడం కోసమే పుట్టారు అంటూ ఆయన మాట్లాడారు. ఆయన ఎందుకు అలా అన్నారు?. బీహారీ ప్రజల గురించి చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నా. బీహారీల ప్రజల పట్ల సంవత్సరాల తరబడి నిర్లక్ష్యం, అగౌరవం ఉంది. 1989లో అప్పటి ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ బీహార్‌ను అభివృద్ధి కేంద్రంగా మారుస్తానని చెప్పారు. ఆ డబ్బు ఎక్కడికి పోయింది?. ఆ తర్వాత కాంగ్రెస్ అధికారంలో ఉంది. కాబట్టి మీరు బీహార్‌కు ఏం చేశారో మాకు చెప్పండి? అని ప్రశ్నించారు. సిక్కులకు జరిగిన అన్యాయానికి కాంగ్రెస్ క్షమాపణ చెబితే.. రాహుల్ గాంధీ బీహార్‌లో ప్రచారం చేసే ముందు బీహారీలకు కూడా క్షమాపణ చెప్పాలి. బీహారీలు శ్రమ కోసమే పుట్టినట్లయితే, మీరు ఇక్కడికి ఎందుకు వస్తున్నారు? తెలంగాణలో ప్రచారం చేసి అక్కడ మీ ఓట్లు పొందండి. బీహార్‌లో కాంగ్రెస్‌కు ఉనికి లేదు. రాహుల్ గాంధీకి నిజంగా రాజకీయ బలం ఉంటే, ఆయన బీహార్‌లో ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలి. లాలూ పార్టీలో పొత్తు లేకుండా బరిలో దిగాలి అని సవాల్ విసిరారు.

## కదిలిన జగన్నాథుని రథ చక్రాలు

గోపాలపూర్

హరిబోల్, జై జగన్నాథ్ అన్న భక్తుల నినాదాల మధ్య శుక్రవారం ఒడిశాలోని పూరీలో జగన్నాథుని నందిఘోష్ రథం కదిలింది. లక్షల మంది భక్తుల రాకతో పూరీ దివ్యధామం జనసంద్రాన్ని తలపించింది. శ్రీక్షేత్ర యంత్రాంగం పర్యవేక్షణలో పురుషోత్తముని సేవలన్నీ నిర్ణీత వేళల్లో జరిగాయి. తెల్లవారుజాము 4 గంటలకే ఆలయం తలుపులు తెరిచిన సేవాయత్‌లు జగన్నాథుడు, బలభద్ర, సుభద్ర, సుదర్శనుడితో కూడిన సన్నిధిలో మంగళహారతి, మైలం, అబకాశ, గోపాలవల్లభ సేవలు నిర్వహించారు. తర్వాత పొహండి వేడుకలో భాగంగా చతుర్ధామూర్తులకు చాలమాల, సెనాపట అలంకరించారు. 10.40 గంటలకు ప్రారంభమైన పొహండి 12.10 గంటలకు ముగిసింది. రథాలు అధిరోహించిన దారు విగ్రహాల సన్నిధిలో ఇతర సేవలు కొనసాగాయి. మధ్యాహ్నం 2.05 గంటలకు పూరీ శంకరాచార్య నిశ్చలానంద సరస్వతి శిష్యగణంతో రథాలపైకి వచ్చి పూజలు చేశారు. పూరీ రాజు గజపతి దివ్యసింగ్‌దేవ్ ఆనవాయితీ ప్రకారం చతుర్ధామూర్తుల సన్నిధిలో బంగారు చీపురుతో చెరా పహరా చేసి, కస్తూరి కల్లాపి చల్లి హారతులిచ్చారు. అనంతరం రథాలకు అశ్వాలు, సారథులు అమర్చి తాళ్లు కట్టారు. తొలుత 4.10 గంటలకు బలభద్రుని తాళధ్వజ రథం యాత్రగా బొడొదండొ మీదుగా గుండిచాదేవి ఆలయం వైపు కదిలింది. దేవీ సుభద్ర దర్పదళన్, చివరిగా పురుషోత్తముని నందిఘోష్ రథాలు అమ్మ మందిరానికి కదిలాయి. భక్తులు జగన్నాథుడిని స్మరిస్తూ రథాలు లాగేందుకు పోటీపడ్డారు. చీకటిపడే వరకూ రథయాత్ర సాగింది. 7.10 గంటలకూ రథాలు గుండిచాదేవి మందిరానికి చేరుకోకపోవడంతో యాత్రను మధ్యలోనే నిలిపివేశారు. నేడు నిలిపివేసిన చోటు నుంచే యాత్ర మళ్లీ ప్రారంభించి.. రథాలను గుండిచా మందిరానికి చేర్చనున్నారు.

**మంత్రులంతా కలిసి..**

గవర్నరు కంభంపాటి హరిబాబు దంపతులు, ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి దంపతులు, కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, గజేంద్రసింగ్ శెఖావత్‌తోపాటు ఒడిశా మంత్రులంతా భక్తులతో కలిసి రథాలు లాగారు. ఇలా చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. వేడుకలో సుమారు 12 లక్షల మంది భక్తులు పాల్గొన్నారని శ్రీక్షేత్ర పాలనాధికారి అరవిందపాఢి తెలిపారు.

**తల్లి చెంత 9 రోజులు**

పెంచిన తల్లి గుండిచా దేవి ఆలయానికి రథయాత్రగా వెళ్లిన జగన్నాథుడు అక్కడ 9 రోజులుంటాడు. జులై 5న తిరుగుయాత్ర (బహుడా)గా శ్రీక్షేత్రానికి చేరుకుంటాడు. అహ్మదాబాద్: గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో శుక్రవారం 148వ జగన్నాథ రథయాత్రకు వేల సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. పురవీధుల గుండా 16 కి.మీ. మేర సందడిగా కొనసాగిన ఈ యాత్ర పూర్తికావడానికి 12 గంటలు పట్టింది. ఈ క్రమంలో శబ్దాలకు బెదిరి ఓ మగ ఏనుగు బారికేడ్‌ను విరగ్గొట్టుకొని రహదారి పక్కకు దూసుకొచ్చింది. దీంతో జనాలు తోసుకోవడంతో ఓ వ్యక్తి గాయపడ్డారు. అయితే మావటీలు గజరాజును అదుపు చేయడంతో ఆ తర్వాత యాత్ర ప్రశాంతంగా కొనసాగింది.

## 13 రోజులైనా కేరళలోనే యూకే యుద్ధ విమానం

త్రివేండ్రం

కేరళలోని తిరువనంతపురం విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండయిన బ్రిటన్ నేవీ యుద్ధ విమానం ఎఫ్-35 గత 13 రోజులుగా అక్కడే ఉంది. టేకాఫ్ ప్రయత్నాలు విఫలం కావడంతో రాయల్ బ్రిటీష్ నేవీ కొత్త ప్రయత్నాలు మొదలుపెట్టింది. హైడ్రాలిక్ స్నాగ్ కారణంగా ఉండిపోయిన ఎఫ్-35బీ యుద్ధనౌకను తరలించడం కోసం యూకే నుంచి ప్రత్యేక టో వాహనం వస్తోంది. 40 మంది బ్రిటిష్ ఇంజనీర్లు, నిపుణుల బృందం కూడా కేరళకు బయల్దేరింది. ఫైటర్ జెట్‌ను భారత్‌లోనే మరమ్మతు చేయనున్నట్లు సమాచారం. యుద్ధవిమానం పార్కింగ్ కోసం బ్రిటన్ భారీగా ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. సరిపడా ఇంధనం లేకపోవడంతో పాటు వాతావరణం అనుకూలించక విమాన వాహన నౌక తిరిగి రాకపోవడంతో ఎఫ్-35బి జూన్ 14న తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండవడం తెలిసిందే. సురక్షిత ల్యాండింగ్‌కు భారత వైమానిక దళం వీలు కల్పించింది. ఇంధనం నింపడంతో పాటు అన్నిరకాల మద్దతు అందించింది. కానీ హైడ్రాలిక్ వైఫల్యంతో జెట్ ఎగరలేకపోయింది. దాన్ని సరిచేయడానికి రాయల్ నేవీ టెక్నీషియన్ల చిన్న బృందం చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. విమానం ప్రస్తుతం సెంట్రల్ ఇండ్రస్టియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) రక్షణలో బే 4 వద్ద ఉంది. "తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎఫ్-35బీని వీలైనంత త్వరగా మరమ్మతు చేయడానికి యూకే కృషి చేస్తోంది. భారత అధికారుల నిరంతర మద్దతుకు మేము కృతజ్ఞతలు తెలుపుతున్నాము"అని భారత్‌లోని బ్రిటిష్ హైకమిషన్ పేర్కొంది. నిపుణుల బృందం మరమ్మత్తు ప్రయత్నాలు కూడా విఫలమైతే జెట్‌ను యూకేకి విమాన మార్గంలో తరలించడమే చివరి మార్గమని చెబుతున్నారు.

జోరుగా మీమ్స్

బ్రిటన్ యుద్ధ విమానం రెండువారాలుగా కేరళలోనే ఉండటంపై ఆన్‌లైన్‌లో జోరుగా మీమ్స్ పుట్టుకొస్తున్నాయి. 11 కోట్ల డాలర్ల విలువైన జెట్‌ను కేవలం 4 కోట్లకే ఓఎల్ఎక్స్‌లో అమ్మకానికి ఉంచినట్లు ఓ పోస్ట్ వైరల్ అవుతోంది. రెండు వారాలుగా ఇక్కడే ఉంటున్నందున ఆ జెట్‌కు భారత పౌరసత్వానికి అర్హత వచ్చిందని కొందరు చమత్కరించారు. "బహిరంగ ప్రదేశంలో పార్క్ చేయబట్టి సరిపోయింది. మరెక్కడైనా అయితే దొంగతనానికి గురయ్యేది"అంటూ మీమ్స్ వైరలవుతున్నాయి.

## ప్రపంచ పోలీసు క్రీడలకు ఆతిథ్య దేశంగా భారత్ ఎంపిక

**ఢిల్లీ:** ప్రతిష్టాత్మకమైన 2029 ప్రపంచ పోలీసు, అగ్నిమాపక క్రీడలకు ఆతిథ్య దేశంగా భారత్ ఎంపికైనట్టు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ వేదికగా ఈ క్రీడలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ అవకాశం దక్కడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని పేర్కొన్నారు. "పోలీసు క్రీడల నిర్వహణకు భారత్ ప్రతిష్టాత్మక బిడ్‌ను గెలుచుకొంది. కేంద్ర ప్రభుత్వం నిర్మించిన విస్తారమైన క్రీడా మౌలిక సదుపాయాలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించింది. 1985 నుంచి రెండేళ్లకు ఒకసారి ప్రపంచ పోలీసు, అగ్నిమాపక కీడ్రలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు 20 సార్లు ఈ పోటీలు జరిగాయి. అమెరికా 8, కెనడా 5, యూరప్ 4, బ్రిటన్ 2, చైనా ఒకసారి ఈ క్రీడలు నిర్వహించాయి. 2007 నుంచి 2023 వరకు భారత పోలీసు సిబ్బంది 1400 పతకాలు గెలుచుకున్నారు" అని అమిత్ షా వివరించారు.

## పిల్లలను కనే అవకాశం ఉన్నవాళ్లు కనీసం ముగ్గురిని కనండి

పిల్లలను కనే అవకాశం ఉన్నవాళ్లు కనీసం ముగ్గురిని కనాలని టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ కోరారు. అమెరికాలో జననాల రేటు తగ్గుతుండటంపై మస్క్ ఆందోళన వ్యక్తంచేశారు. పలు కారణాల వల్ల ప్రపంచవ్యాప్తంగా జననాల రేటు తగ్గుతున్నదని, దాన్ని నివారించాలంటే సంతానం కనగలిగిన వాళ్లు కనీసం ముగ్గురికి జన్మనివ్వాలని సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. ప్రపంచదేశాల్లో తగ్గుతున్న జనాభా స్థాయిలను నిలబెట్టడానికి మహిళలు సగటున ముగ్గురు పిల్లలను కనాలని ఇటీవల ఫార్చ్యూన్ నివేదిక పేర్కొన్నది. దాన్ని ఉటంకిస్తూ మస్క్ తాజా పోస్టు చేశారు. ఈ నివేదిక ప్రకారం ధనిక దేశాలైన అమెరికా, ఇటలీ, జపాన్ తదితర దేశాల్లో జననాల రేటు ప్రతి ఏడాది తగ్గుతోందని, దాంతో జనాభా క్రమంగా పడిపోతోందని నిపుణులు పేర్కొన్నారు. దీనిని నివారించాలంటే సంతానం కనగలిగే మహిళలు కనీసం ముగ్గురు పిల్లలను కనాలని సూచించారు. అమెరికా లాంటి దేశాల్లో జననాల రేటు తగ్గుతుండటం వల్ల వారి నాగరికత పతనమయ్యే ప్రమాదం

# రాజకీయ దురంధరుడు పాములపర్తి

సమకాలీన రాజకీయ పరిస్థితులను అవగాహన చేసుకొని తదనుగుణంగా సానుకూల వాతావరణం ఏర్పరచుకుని పరిపాలన సాగించిన వాడే సమర్థుడైన నాయకుడు కాగలడు అనేది అర్థశాస్త్ర రచయిత అయిన కౌటిల్యుడిగా పేరున్న చాణక్యుని అభిప్రాయం. ఆ అభిప్రాయాన్ని పూర్తిగా ఆకళింపు చేసుకొని, తదనుగుణంగా నడుచుకొని బలం, బలగం లేకున్నా, దేశ రాజకీయాలపై చెరగని ముద్ర వేయ గలిగారు పి.వి. నరసింహారావు. దక్షిణ భారతావని నుండి ప్రధానమంత్రి పదవిని అధిష్టించిన తొలి నేతగా, ఒకే ఒక తెలుగువానిగా, నరసింహారావు కార్యదీక్షత, దార్శనికత ద్వారా ఖ్యాతి గడించారు. "పి.వి"గా లబ్ద ప్రతిష్టులైన ఆయన బహు భాషావేత్త, రచయిత. స్నాతకోత్తర న్యాయశాస్త్ర కోవిదులు, "అపర చాణక్యుడిగా" పేరొందారు. ఆంధ్ర ప్రదేశ్ లోని వరంగల్ జిల్లా, నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో 1921 జూన్ 28 న రుక్మాబాయి, సీతారామారావు దంపతులకు పి.వి జన్మించారు. వరంగల్లు జిల్లాలోనే ప్రాథమిక విద్య మొదలు పెట్టారు. తరువాత కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణమ్మలు ఆయనను దత్తత తీసుకోవడంతో అప్పటినుండీ పాములపర్తి వెంకట నరసింహారావు అయ్యారు. 1938 లోనే హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు పార్టీలో చేరి నిజాము ప్రభుత్వ నిషేధాన్ని ధిక్కరిస్తూ "వందేమాతరం" గేయాన్ని పాడారు. తాను చదువుకుంటున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఆయనను బహిష్కరించారు. దాంతో ఓ మిత్రుడి సాయంతో నాగపూరు విశ్వవిద్యాలయంలో చేరి నాగపూరులో ఆ మిత్రుని ఇంట్లోనే ఉంటూ, 1940 నుండి 1944 వరకు ఎల్.ఎల్.బి చదివారు. స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృష్ణారావుల అనుయాయిగా స్వాతంత్ర్యోద్యమం లోను, హైదరాబాదు విముక్తి పోరాటంలోను పాల్గొన్నారు. 1957 లో శాసనసభ్యుడిగా రాజకీయ జీవితం ఆరంభించిన పివి, రాష్ట్ర మంత్రిగా, ముఖ్య మంత్రిగా కేంద్ర మంత్రిగా, చివరకు ప్రధానిగా తన మేధాశక్తితో, క్రమానుగతంగా ఉన్నత పదవులను, కైవసం చేసుకున్న రాజనీతిజ్ఞులు ఆయన. కాంగ్రెస్ హయాంలో, పూర్తి సంఖ్యాబలం లేని మైనారిటీ ప్రభుత్వాన్ని, తన చాకచక్యంతో చాణక్యనీతితో, పూర్తి కాలం నడిపించిన మేధావి. 1957 లో మంథని నుండి ఎమ్మెల్యేగా ఎన్నికై, వరుసగా నాలుగు సార్లు గెలిచారు. 1962 లో మొదటిసారి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం పొంది, 62 నుండి 64 వరకు న్యాయ సమాచార మంత్రిగా, 64 నుండి 67 వరకు దేవాదాయ, న్యాయబీ 67 లో వైద్య ఆరోగ్య 68 నుండి 71 వరకు న్యాయ, సమాచార శాఖలను నిర్వహించారు. 77లో లోకసభకు ఎన్నికైనారు. జనవరి 1980 – జూలై 1984 కేంద్ర విదేశ వ్యవహారాల మంత్రి జూలై 1984 – డిసెంబర్ 1984 ఇంద్ర హోం శాఖమంత్రిబీ నవంబరు 1984 – ఫిబ్రవరి 1985 భారత ప్రణాళికా శాఖ మంత్రి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, జనవరి 1985 – సెప్టెంబరు 1985 కేంద్ర రక్షణ శాఖమంత్రి, సెప్టెంబరు 1985 – జూన్, 1988



కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిబీ జూలై 1986 – ఫిబ్రవరి 1988 కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖమంత్రిబీ జూన్ 1988 – డిసెంబర్ 1989 విదేశ వ్యవహారాల శాఖ మంత్రిబీ 1991 మే 29 – 1996 కాంగ్రెసు పార్టీ అధ్యక్షునిగాబీ జూన్ 1991 %–% 1996 మే 10 వరకు ప్రధానమంత్రిగా పని చేశారు. 71 సెప్టెంబర్ నుండి 73 జనవరి వరకు ముఖ్యమంత్రిగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. సీఎం పీఠం అధిష్టించగానే అసమ్మతి. ఈ విషయమై అధిష్టానంతో చర్చించేందుకు ఢిల్లీ – హైదరాబాదుల మధ్య తిరిగేందుకే ఆయనకు సమయం సరిపోయింది. పట్టణ భూ గరిష్ట చట్టాన్ని తెచ్చింది ఆయనే. ఆ తర్వాత ఆయన కార్యక్షేత్రం ఢిల్లీకి మారింది. ఏఐసిసి ప్రధాన కార్యదర్శిగా, మొదటిసారి హనుమకొండ నుండి లోకసభకు ఎన్నికైనారు. నంద్యాల ద్వారా ఉప ఎన్నికలలో, టిడిపి పోటీ లేకుండా ఐదు లక్షల పైచిలుకు మెజారిటీతో గెలుపొంది, గిన్నిస్ రికార్డు సృష్టించి, పదవ లోకసభలో అడుగిడి, పలు శాఖల మంత్రిగా విధులు నిర్వర్తించారు. రాజీవ్ హత్య కారణంగా 1991 లో సార్వత్రిక ఎన్నికలలో పోటీ చేయకుండానే, దేశ 10వ ప్రధాన మంత్రి పదవి చేపట్టారు. భారత ఆర్థిక సంస్కరణలకు బీజం వేసి కుంటుతున్న వ్యవస్థను, తిరిగి పట్టాలెక్కించిన ఘనత సొంతం చేసుకుని, "భారత ఆర్థిక సంస్కరణల పితామహుడిగా" పేరొందిన మేధావి. ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనం కోసం చేపట్టిన సంస్కరణలు, రిజర్వు బ్యాంకు గవర్నర్ గా, ఆర్థిక శాస్త్రవేత్త గా ఉన్న మన్మోహన్ సింగ్ ను, ప్రత్యేకించి పిలిచి, దేశ ఆర్థిక మంత్రిని చేయడం ఆయనకే చెల్లింది. దేశాన్ని బంగారం తాకట్టు పెట్టాల్సిన స్థితి నుండి, సూపర్ పవర్ గా తేర్చి దిద్దడానికి పునాది వేశారు. ఆర్థిక సంస్కరణల ద్వారా మార్కెట్ సరళీకరణ ఆర్థిక విధానాన్ని రూపొందించారు. సంస్కరణల 1992 లో నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ కంప్యూటర్ ఆధారిత వ్యాపార పద్ధతిని ప్రారంభించారు. పంజాబ్ తీవ్రవాదాన్ని అణచి వేసింది ఆయన ప్రభుత్వమే. కాశ్మీర్ తీవ్రవాదులు ప్రముఖులను అపహరించినప్పుడు, వారి డిమాండ్లను లెక్క పెట్టక బందీలను విడిపించిన ఘనత ఆయనదే. ఇజ్రాయెల్ తో దౌత్య సంబంధాలు, తీవ్రవాదానికి పాకిస్థాన్ ఇస్తున్న ప్రోత్సాహాన్ని బయటపెట్టి, ఆగ్నేయాసియా దేశాలతో సత్సంబంధాలు కలిగి ఉండడం, పివి ప్రభుత్వం సాధించిన విజయమే. 1998లో వాజపేయి ప్రభుత్వం జరిపిన అణుపరీక్షల కార్యక్రమాన్ని మొదలు పెట్టింది పీవీ ప్రభుత్వమే. ఆయన కాలంలోనే బాంబు తయారయింది. ఈ విషయాన్ని స్వయంగా వాజపేయే ప్రకటించారు. రాష్ట్ర విద్యా మంత్రిగా రెసిడెన్షియల్ పాఠశాలల వ్యవస్థ, కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రిగా నవోదయ విద్యాలయాలకు రూపకర్త అయినారు. 1973లో సీఎంగా భూస్వామ్య వ్యవస్థ నిర్మూలనకు నడుం బిగించి, భూ గరిష్ట పరిమితి, పట్టణ పరిమితి చట్టాన్ని అమలు చేసిందీ పి.వి.నే. ప్రధానిగా ఆయన హయాంలో 1992 డిసెంబర్ 6 న అయోధ్యలో బాబరీ మసీదును కూలగొట్టిన సంఘటనలో పీవి వైఖరి వివాదాస్పదమైంది. ప్రధానిగా ఐదేళ్ళ పదవీకాలంలో అనేక అవినీతి ఆరోపణలను పివి ఎదుర్కొన్నారు. చివరి కేసులన్నీ వీగిపోయాయి. బహుభాషా పండితులు, 17 భాషలలో అలవోకగా మాట్లాడ గలిగిన మేధావి. 1940 లో తన సోదరులతో కలిసి కాకతీయ పత్రికలో ఎన్నో వ్యాసాలు రాశారు. 1948 నుండి 51 వరకు కాకతీయ పత్రిక "సంపాదకునిగా" పని చేశారు. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ విరచిత వేయి పడగలను, "సహస్ర ఫణ్" పేరుతో, హిందీ అనువాదం చేసి జ్ఞానపీఠ అవార్డు పొందారు. 1968–74 మధ్య తెలుగు సాహిత్య అకాడమీ చైర్మన్ గా ఉన్నారు. ఆయన రచనల్లో ప్రఖ్యాతి చెందినది "ఇన్సైడర్" అనే ఆత్మకథ. లోపలి మనిషిగా ఇది తెలుగులోకి అనువాదమయింది. 1983 లో స్పానిష్ భాషలో ప్రసంగించి, అలీన దేశాల శిఖరాగ్ర సమావేశంలో, క్యూబా అధ్యక్షులు ఫిడేల్ ను అబ్బుర పరిచిన గొప్పతనం ఆయనది. నిరాడంబరుడు, తన పిల్లలను సైతం ప్రధాని కార్యాలయానికి దూరంగా ఉంచిన నిజాయతీ పరులు. చివరిదశలో కోర్టుల చుట్టూ తిరగడానికి సొంత ఆస్తులను అమ్ముకున్న వ్యక్తి. నిజాం వ్యతిరేక పోరాట యుద్ధ తంత్ర నిపుణునిగా చివరకు స్వతంత్ర్య సముపార్జన దినం నాడు, 1947 ఆగస్టు 15 న కూడా అటవీ క్షేత్రంలో పోరాట క్రమంలోనే ఉన్న పోరాట యోధుడు. 2004 డిసెంబర్ 23 న తుది శ్వాస వదిలా రాయన. పి.వి. స్మృత్యర్థం హైదరాబాదులో భారత దేశంలోనే అతిపెద్ద ఫ్లై ఓవర్ కు పి.వి. నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే అని పేరుపెట్టారు. శంషాబాద్ విమానాశ్రయం ప్రయాణీకులను దృష్టిలో ఉంచుకొని దీనిని నిర్మించి, 19.10.2009 న ప్రారంభించారు. పివికి భారత రత్న అవార్డు ఇవ్వాలని సీఎం కేసిఆర్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తునే ఉన్నారు. శత జయంతి ఉత్సవాలను ఏడాదిపాటు నిర్వహించాలని కేసిఆర్ నిర్ణయించి, సీనియర్ నేత కేశవరావు అధ్యక్షతన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, అనురించడం ద్వారా కేసిఆర్, తెలుగు జాతి మహోన్నత వ్యక్తికి తగిన గౌరవం ఇవ్వడం ముదావహం.

# బీమా చైతన్యం...
# భవితకు ఆత్మవిశ్వాసం

ప్రతి సంవత్సరం జూన్ 28న నేషనల్ ఇన్సూరెన్స్ అవేర్‌నెస్ డేను పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా బీమా రంగంపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయి. ఈ ప్రత్యేక దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం ప్రజల్లో బీమా యొక్క ప్రాముఖ్యతను చాటి చెప్పడం, భవిష్యత్తు ఆర్థిక భద్రత కోసం బీమా అవసరాన్ని తెలియ జేయడం. అనిశ్చితతలతో నిండిన ఆధునిక జీవన విధానంలో బీమా ఒక ఆర్థిక సాధనంగా కాకుండా, కుటుంబాన్ని కాపాడే రక్షణ కవచంగా, మనసుకు భరోసానిచ్చే ఆశాజ్యోతిగా మారింది. బీమా అనేది భవిష్యత్తులో సంభవించే నష్టాలను, ప్రమాదాలను ఎదుర్కొనడానికి ఆర్థిక భద్రతను కల్పించే విధానము. బీమా పాలసీ తీసుకున్న వ్యక్తి నిర్దిష్టమైన మొత్తం ప్రీమియంగా చెల్లిస్తే, ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు ఒప్పందంలోని నిబంధనల ప్రకారం బీమా సంస్థ ఆర్థిక పరిహారం అందిస్తుంది. ఇది వ్యక్తిగత స్థాయిలోనే కాదు, కుటుంబం, వ్యవసాయం, వాహనం, ఆస్తి వంటి అనేక రంగాల్లో రక్షణ కల్పిస్తుంది. ఒకవేళ ఆర్థిక నష్టం జరిగినా, అది వ్యక్తి జీవన ప్రమాణాన్ని పూర్తిగా కూల్చి వేయకుండా అడ్డుకుంటుంది. బీమాపై సరైన అవగాహన లేని ప్రజల శాతం భారత దేశంలో ఇంకా అధికంగానే ఉంది. కొందరికి ఇది అవసరం లేదనిపిస్తుంది, మరికొందరికి ఖర్చు లాగా అనిపిస్తుంది. కొంతమంది బీమా పాలసీ తీసుకున్నా, దాని ప్రయోజనాలు ఎలా పొందాలో తెలియదు. ఈ నేపథ్యంలో బీమా అవగాహన దినోత్సవం అత్యంత ప్రాధాన్యంతో కూడుకున్నదిగా నిలుస్తోంది. ఈ రోజును పురస్కరించుకుని ప్రజలకు బీమా రకాలు, వాటి ప్రయోజనాలు, ఎలా దరఖాస్తు చేసుకోవాలో, ఎలా నష్టపరిహారం పొందాలో వంటి అంశాలపై వివరంగా తెలియ జేయడం జరుగుతుంది. మన జీవితాల్లో అనేక అప్రమత్తతలు ఉండవలసిన అవసరం ఉంది. అనారోగ్యం, ప్రమాదం, పంట నష్టం, వాహన ప్రమాదం, ప్రకృతి విపత్తులు వంటి అనేక సంఘటనలు మనకు ఎదురవుతుంటాయి. ఇవి వచ్చినప్పుడు పెద్ద మొత్తంలో ఆర్థిక భారం ఎదురవుతుంది. అలాంటి సమయంలో బీమా ఉండటం వల్ల ఆ భారాన్ని స్వల్పంగా చేయవచ్చు. ఉదాహరణకు, ఓ చిన్న ఆరోగ్య సమస్యకు ఆసుపత్రి ఖర్చు లక్షల్లో చేరుతున్న తరుణంలో ఆరోగ్య బీమా ఉండటం ఎంతో ఉపశమనంగా మారుతుంది. అలాగే, కుటుంబ పోషకుడు అకస్మాత్తుగా మృతి చెందితే జీవిత బీమా వల్ల కుటుంబానికి ఆర్థికంగా కుంగిపోకుండా ముందుకు సాగేందుకు



తోడ్పడుతుంది. బీమా సేవల పరిధి రోజు రోజుకూ విస్తరిస్తున్నప్పటికీ, అందుబాటులో ఉన్న అన్ని రకాల బీమాలను ప్రజలు తెలుసుకోవడం ముఖ్యం. జీవిత బీమా, ఆరోగ్య బీమా, వాహన బీమా, గృహ బీమా, ప్రయాణ బీమా, పంట బీమా వంటి అనేక బీమా రకాలున్నాయి. ప్రతి ఒక్కటి ప్రత్యేక అవసరాలను తీర్చేందుకు రూపొందించ బడ్డది. ప్రతి వ్యక్తి తన అవసరాన్ని బట్టి సరైన పాలసీ ఎంచుకోవాలి. ఇది కేవలం బీమా సంస్థల పక్కనుండి వెళ్లిపోవడం కాదుబీ భవిష్యత్తు కోసం ముందస్తుగా వేసే భద్రతా అడుగు. బీమా రంగం భారత దేశంలో రెండు శతాబ్దాలకు పైగా చరిత్ర కలిగి ఉంది. 1818లో ప్రారంభమైన ఈ రంగం 1956లో జీవ సంస్థలన్నింటినీ ఏకీకృతంగా "భారత జీవిత బీమా సంస్థ"గా కలపడం ద్వారా పునర్ వ్యవస్థీకృతమైంది. 1999లో బీమా నియంత్రణ అభివృద్ధి సంస్థ ఏర్పడి, ప్రైవేటు సంస్థలకు అవకాశం కల్పించడంతో బీమా మరింత విస్తృతమైంది. ప్రస్తుతం భారత జీవ బీమా సంస్థ, హెచ్.డి.ఎఫ్.సీ జీవ బీమా, ఎస్.బి.ఐ జీవ బీమా, ఐ.సి.ఐ.సి.ఐ ప్రమాద బీమా, న్యూ ఇండియా అష్యూరెన్స్ వంటి సంస్థలు ప్రజలకు విశ్వసనీయంగా సేవలందిస్తున్నాయి. ప్రభుత్వం కూడా సామాన్యులకు బీమా అందుబాటులో ఉండేలా అనేక ప్రజా పథకాలను అమలు చేస్తోంది. అందులో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకం, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలు ప్రజలకు తక్కువ ఖర్చుతో గరిష్ట ప్రయోజనం అందించేలా రూపొందించ బడ్డాయి. ఇవి ప్రత్యేకించి నిరుపేదలకు, అసంఘటిత రంగాల్లో పనిచేసే వారికి, గ్రామీణ జనాభాకు అండగా నిలుస్తున్నాయి. ఇన్నాళ్లు సంప్రదాయ పద్ధతుల్లో కొనుగోలు చేసిన బీమా ఇప్పుడు తంత్ర జ్ఞాన ఆధారిత రూపాన్ని సంతరించుకుంది. ఆధార్ ఆధారిత ధృవీకరణతో, చేతి ఫోనులో నుంచే పాలసీలు కొనుగోలు చేయడం, నష్టపరిహారం పొందడం సులభమైంది. పాలసీ బజార్, డిజిట్, ఆకో వంటి మాధ్యమాల ద్వారా బీమా తీసుకోవడం ఎంతో వేగవంతమైన ప్రక్రియగా మారింది. ఇవి కొత్త తరానికి వినూత్నమైన అవకాశం. బీమా ఉండటం ఎంత ముఖ్యమో, దానిని సక్రమంగా ఉపయోగించు కోవడమూ అంతే ముఖ్యం. పాలసీ నిబంధనలు పూర్తిగా చదవడం, అవసరమైన ఆధారాలు సమకూర్చు కోవడం, ప్రమాదం జరిగిన వెంటనే సంస్థకు సమాచారం ఇవ్వడం వంటి అంశాలు ప్రతీ పాలసీ దారుడికి తెలియాలి. అప్పుడే నష్ట పరిహారం పొందే ప్రక్రియలో ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిగా ప్రయోజనం పొందవచ్చు. ఈ నేషనల్ ఇన్సూరెన్స్ అవేర్‌నెస్ డే మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తోంది %–% బీమా ఉండటం అనేది శుభ సూచకం. అది భయానికి కాదు, భరోసాకు సంకేతం. అది వ్యయానికి కాదు, సంక్షేమానికి సూచిక. మన జీవితంలో ఒక్క అవకాశం తప్పితే జీవితం మారిపోతుంది. అలాంటి సంధిలో బీమా మన కుటుంబానికి నమ్మకమైన నీడలాంటిది. ఈరోజు మనకు ఆదర్శనంగా ఉండాలి. మన కుటుంబం భవిష్యత్తు కోసం, మన పిల్లల భద్రత కోసం, అనుకోని సంఘటనల్లో ఆర్థిక పరంగా వెనుక పడకుండా ఉండేందుకు బీమా తీసుకోవడం మంచి నిర్ణయం. ప్రతి ఒక్కరూ కనీసం ఒక జీవ బీమా లేదా ఆరోగ్య బీమా పాలసీతో తమ భవిష్యత్తును భద్ర పర్చుకోవాలి. అదే నిజమైన తెలివైన నిర్ణయం. బీమా లేదు అంటే భద్రతా లేదు. బీమా ఉన్న చోటే భరోసా ఉంటుంది. కనుక ఈరోజే బీమా గురించి తెలుసుకోండి. మీ అవసరానికి తగిన పాలసీ ఎంచుకోండి. మీ జీవితాన్ని, మీ కుటుంబాన్ని సురక్షితంగా, సంతోషంగా గడపండి.

# 2027 నాటికి పునర్విభజన జరిగేనా?

భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో నియోజకవర్గాల పునర్విభజన ఒక ముఖ్యమైన వ్యవస్థాపక ప్రక్రియ. ఇది జనాభా ప్రాతిపదికన ప్రజలకు సముచితమైన ప్రాతినిధ్యాన్ని కల్పించేందుకు అవసరమవుతుంది. దేశంలోని పార్లమెంటు మరియు శాసనసభ నియోజకవర్గాల భౌగోళిక విభజనను, పరిమాణాన్ని సమయానుకూలంగా పునర్నిర్వచిం చడమే ఈ ప్రక్రియ యొక్క లక్ష్యం. రాజ్యాంగంలోని అధికరణ 82 మరియు 170 ప్రకారం, ఇది సవరణల ద్వారా అమలవుతుంది. చివరిసారిగా 2002లో పునర్విభజన జరిగి, 2008లో అమలులోకి వచ్చింది. కానీ రాజ్యాంగ 84వ సవరణ (2002) ప్రకారం, తదుపరి పునర్విభజనను 2026 వరకు నిలిపివేశారు. అంటే, 2026 తర్వాత జరగనున్న జనాభా గణన ఆధారంగా కొత్త డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేసి, 2027 నాటికి దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన జరగవచ్చని అంచనా. ఈ నేపథ్యంలో తెలంగాణలో శాసనసభ స్థానాలు 119 నుండి 153కి పెరగవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ అంశంపై 2014లో వెలువడిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని 26వ విభాగంలో స్పష్టంగా ప్రస్తావించ బడింది. అయితే, 2026లోని రాజ్యాంగ పరిమితి పూర్తయ్యే దాకా కేంద్ర ప్రభుత్వం ఈ పెంపును ఆమోదించ లేని స్థితి ఏర్పడింది. ఇక, 2027 పునర్విభజన అనంతరం దీనికి చట్టబద్ధంగా మార్గం సిద్ధమవుతుంది. తెలంగాణలో 2023 జనాభా అంచనాల ప్రకారం రాష్ట్ర మొత్తం జనాభా దాదాపు 4 కోట్ల 35 లక్షలు. ఈలోపు హైదరాబాద్ మెట్రో ప్రాంత జనాభానే దాదాపు 1.1 కోట్లు తో ఉంది. శాసనసభ స్థాయిలో చూస్తే, ప్రస్తుతం ఉన్న 119 నియోజకవర్గాల సగటు జనాభా దాదాపు 3.65 లక్షలు. కానీ కొన్ని పట్టణ నియోజకవర్గాల్లో ఇది 5 లక్షలు దాటిన సందర్భాలున్నాయి, అటు పల్లెలోని నియోజక వర్గాల్లో మాత్రం 2 లక్షలకు లోపే ఉన్న ఉదాహరణలు ఉన్నాయి. ఈ అసమానతలను సరిదిద్దేందుకు, జనాభా సమానమైన నియోజక వర్గాలు ఏర్పరచడం అత్యవసరమవుతుంది. నియోజక వర్గాల సంఖ్యను 119 నుండి 153కి పెంచితే, ప్రతి నియోజకవర్గానికి సగటు జనాభా 2.85 లక్షల పరిధిలో ఉంటుంది. ఇది ప్రజలకు ప్రాతినిధ్యాన్ని మరింత సమీపంగా చేస్తుంది. పైగా ప్రస్తుతం రాష్ట్రంలో 33 జిల్లాలు ఉండగా, కొన్ని జిల్లాల్లో మూడు నియోజక వర్గాలే ఉండగా, ఇతర జిల్లాల్లో ఏడు వరకు ఉన్నాయి. 153 నియోజక వర్గాలు ఏర్పడితే, జిల్లాల వారీగా నియోజకవర్గ పంపిణీ తారతమ్యం తగ్గే అవకాశముంది. పునర్విభజన తర్వాత కొత్త నియోజక వర్గాలు ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలు – మేడ్చల్, సంగారెడ్డి, రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం, మహబూబ్ నగర్, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, నిర్మల్, జనగామ, కరీంనగర్, పెద్దపల్లి, జోగులాంబ గద్వాల్, నారాయణపేట మొదలైనవి. అలాగే జడ్చర్ల, కందుకూర్, బూదన్ పోచంపల్లి, భువనగిరి, మిర్యాలగూడ, సిద్దిపేట, వంటి అభివృద్ధి చెందిన పట్టణాలు కొత్త నియోజక వర్గాలుగా మారే అవకాశముంది. పునర్విభజన వల్ల కలిగే లాభాలు అనేకం. ప్రథమంగా ప్రజలకు దగ్గరగా ఉండే ప్రజా ప్రతినిధులను ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వ పాలన మరింత సమర్థవంతంగా మారుతుంది. ప్రజా అవసరాలు, అభివృద్ధి ప్రాధాన్యతలు త్వరగా ప్రభుత్వానికి చేరతాయి. వెనుకబడిన ప్రాంతాల సమస్యలు కూడా శాసనసభలో ప్రాధాన్యతతో చర్చకు వస్తాయి. పట్టణాలలోని వృద్ధి చెందిన మున్సిపాలిటీలకు ప్రత్యేక నియోజకవర్గ ప్రాతినిధ్యం లభిస్తుంది. ఇది మౌలిక సదుపాయాల విస్తరణకు తోడ్పడుతుంది. అయితే సవాళ్లు కూడా తక్కువగా లేవు. శాసనసభ స్థానాల పెంపుతో ప్రతినిధుల ఖర్చులు, సిబ్బంది, కార్యాలయ నిర్వహణ మొదలైనవి ప్రభుత్వంపై ఆర్థిక భారం కలిగిస్తాయి. అంతేగాక, కొత్త నియోజక వర్గాల సరిహద్దులు నిర్ణయించేటప్పుడు సామాజిక, భౌగోళిక, రాజకీయ కోణాలు పరస్పరంగా పోటీ పడే అవకాశం ఉంటుంది. దీనివల్ల కొన్నిచోట్ల ప్రజల నిరసనలు, సంఘర్షణలు తలెత్తే ప్రమాదం కూడా ఉంటుంది. రాజకీయంగా చూస్తే, స్థానాల పెంపుతో స్థానిక నేతల మధ్య పోటీ పెరగడం వల్ల పార్టీల అంతర్గత సమీకరణాలు మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో డీలిమిటేషన్ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పాక్షికంగా, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా జరగాలి. కమిషన్ అందుబాటులో ఉన్న తాజా భౌగోళిక, జనాభా గణాంకాలను పరిగణనలోకి తీసుకుని ప్రజలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించేలా నియోజక వర్గాలను పునర్విభజించాలి. రాష్ట్ర ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, ప్రజలు ఈ ప్రక్రియను అంగీకరించి, భాగస్వామ్యం వహించాలి. 2027లో జరగబోయే ఈ పునర్విభజన తెలంగాణ రాజకీయ భవిష్యత్తుకు, పాలనా స్వరూపానికి గణనీయమైన మలుపును ఇస్తుంది. 153 శాసనసభ స్థానాలవైపు జరిగే మార్పు ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు మార్గం వేయ గలదు. ఇది తగిన సమయంలో, సమగ్రంగా, నిబద్ధతతో జరిగితే, తెలంగాణ ప్రజలకు ఇది మెరుగైన పాలనా వ్యవస్థకు నాంది అవుతుంది. ఈ పునర్విభజన ప్రక్రియ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ప్రాధాన్యతను కల్పిస్తూ – గ్రామీణ, పట్టణ, వలస జనాభా ప్రాంతాలకు సమపాళ్లలో ప్రతినిధ్యం ఇచ్చే విధంగా సాగాలి. అప్పుడే నిజమైన ప్రజాస్వామ్య లక్ష్యాన్ని సాధించిన ఫలితం రావచ్చు.

# ఇల్లిల్లు తిరుగుతూ ఇంటి సమస్యలు తెలుసుకుంటూ

పల్లెల్లో పర్యటిస్తు ప్రజలతో మమేకమైతు

గ్రామాలలో నెలకొన్న సమస్యల ను పరిష్కరించడానికి గల్లీ గల్లీ తిరుగుతున్న కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

ఊరు అభివృద్ధి చెందాలంటే అందరూ కలిసికట్టుగా ఉండాలి ఒకరినొకరు సహకరించుకోవాలి

అభివృద్ధి విషయంలో అన్ని పార్టీలు ఒక్కటే.. గ్రామం అనేది శాశ్వతంగా ఉండేది ఎన్నో తరాలు నివసించాయి, ఇంకెన్నో తరాలు నివసించాలి

గ్రామాలలో పెరిగిన రద్దీని దృష్టిలో పెట్టుకొని మౌలిక సదుపాయాలు శాస్త్రీయంగా పకడ్బందీగా అభివృద్ధి చేసుకోవాలి

గ్రామీణ వాతావరణం ఉట్టి పడాలంటే గ్రామంలో గ్రామ పరిసరాలలో వీలైనన్ని మొక్కల్ని నాటాలి





**మునుగోడు, జూన్ 27( ప్రభాత సూర్య):** గ్రామాలలో చేసే అభివృద్ధి శాశ్వతంగా ఉండాలంటే గ్రామస్తులందరూ ఏకతాటి పైకి వచ్చి ఒకరినొకరు సహకరించుకుంటేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి శుక్రవారం ఉదయాన్నే మర్రిగూడెం మండలం ఎర్రగండ్ల పల్లి గ్రామానికి చేరుకొని గ్రామం మొత్తం కలియతిరిగారు. కరెంటు లూస్ లైన్స్ గృహాలకు దగ్గరగా ఉండడంతో వాటిని వెంటనే మార్చాలని ఏఈ కి చెప్పారు.. గ్రామాలలో పెరిగిన రద్దీని దృష్టిలో పెట్టుకొని రోడ్లు డ్రైనేజీ కరెంట్ పోల్స్, కరెంటు లైన్స్ , త్రాగునీటి పైపు లైన్ లను శాస్త్రీయంగా పకడ్బందీగా అభివృద్ధి చేసుకోవాలన్నారు... గ్రామీణ వాతావరణం ఉట్టి పడాలంటే గ్రామంలో గ్రామ పరిసరాలలో వీలైనన్ని మొక్కల్ని నాటాలన్నారు... గల్లి గల్లి తిరుగుతూ ఎటువంటి సమస్యలు ఉన్నాయో ప్రజలని అడిగి తెలుసుకున్నారు... మొదటి



విడతలో ఇందిరమ్మ ఇల్లులు మంజూరు కానీ నిరుపేదల ఇళ్లలోకి వెళ్లి రెండో విడతలో ఇందిరమ్మ ఇల్లులు మంజూరు చేపిస్తానని హామీ ఇచ్చారు.. విలేజ్ మ్యాప్(గ్రామ నక్ష) ను ముందు పెట్టుకొని చుక్క మురుగునీరు నిలవకుండా డ్రైనేజీ సిస్టం ని అభివృద్ధి చేయాలని గ్రామ కార్యదర్శిని ఆదేశించారు... ప్రభుత్వం నుండి నిధులు తీసుకొచ్చే బాధ్యత నాది అని గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ప్రతి ఒక్కరు కలిసికట్టుగా ముందుకు వచ్చి ఒకరినొకరు సహకరించుకుని గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని కోరారు.. గ్రామ అభివృద్ధికి పార్టీలకు సంబంధం లేదని అభివృద్ధి విషయం లో అన్ని పార్టీలు కలిసి రావాల్సిందేనని అన్నారు... గ్రామం శాశ్వతమైనదని ఎన్నో తరాలు ఇక్కడ జీవించాయని ఇంకెన్నో తరాలు జీవించాల్సిన గ్రామాన్ని కలిసికట్టుగా అభివృద్ధి పరుచుకోవాలన్నారు... శాసనసభ్యులతో పాటు మర్రిగూడ మండల ముఖ్య నాయకులు, ఎర్రగండ్లపల్లి గ్రామ ముఖ్య నాయకులు, గ్రామస్తులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు...

# ప్రభుత్వం పేద ప్రజలకు సర్వీస్ చేయడానికి ఉన్నది, ప్రభుత్వానికి విద్య వైద్యం అనేవి రెండు కండ్ల లాంటివి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందుతుందని బాగా చూస్తున్నారని ప్రజల్లో నమ్మకం కలిగేలా ప్రతి ప్రభుత్వ డాక్టరు ఆసుపత్రి సిబ్బంది పని చేయాలి

మునుగోడు నియోజకవర్గం లో ఉన్న సిహెచ్ సి, పీహెచ్సీలలో 75 శాతం నార్మల్ డెలివరీ లు అయ్యేలా చూడాలి

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన ఏ గర్భిణీ స్త్రీని కూడా ప్రైవేటు ఆసుపత్రికి రిఫర్ చేయొద్దు

పీహెచ్సీలు సబ్ సెంటర్ల ద్వారా పబ్లిక్ హెల్త్ పై ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంది.. అయినా సరే ప్రైవేట్ ఆస్పత్రులు ప్రజల జేబులు లూటీ చేస్తున్నారు

మీకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత నాది, ఆసుపత్రికి వచ్చిన ప్రతి ఒక్కరికి నాణ్యమైన ట్రీట్మెంట్ అందించి ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం కలిగించే బాధ్యత మీది

అన్ని మండల కేంద్రాల్లో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆధునికరించుకోవాలి

చౌటుప్పల్ ఆసుపత్రిలో పేషంట్లపై డాక్టర్లు సిబ్బంది నిర్లక్ష్యంపై యాదాద్రి డి.సి.హెచ్.ఎస్ కు ఫోన్ హెల్త్ రివ్యూ లో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

**మునుగోడు, జూన్ 27( ప్రభాత సూర్య):** ప్రజల్లో ప్రభుత్వ వైద్యంపై భరోసా కల్పించే విధంగా ప్రభుత్వ డాక్టర్లు ఆసుపత్రి సిబ్బంది బాధ్యతతో పని చేయాలన్నారు. మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి .. మునుగోడు లోని క్యాంపు కార్యాలయంలో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న హెల్త్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం పేద ప్రజలకు సర్వీస్ చేయడానికే ఉన్నదని ప్రభుత్వానికి విద్య వైద్యం అనేవి రెండు కళ్ళ లాంటివని.. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజల వైద్యంపై కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ ప్రజలు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు... ఇదే అదనుగా ప్రైవేట్ ఆస్పత్రిలు ప్రజల జేబులు లూటీ చేస్తున్నాయన్నారు.. ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్యం అందుతుందని బాగా చూస్తారని ప్రజల్లో నమ్మకం కలిగేలా ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే డాక్టర్లు సిబ్బంది పనిచేయాలన్నారు.. ఇటీవల కాలంలో ప్రజలపై వైద్యభారం ఎక్కువగా పడుతుందని దానిని తగ్గించాల్సిన బాధ్యత, ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కలిగించే బాధ్యత ప్రభుత్వ డాక్టర్లు సిబ్బందిపై ఉందన్నారు. ప్రభుత్వాసుపత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు.. ప్రతి పిహెచ్సిలో 75% సాధారణ ప్రసవాలు అయ్యే విధంగా టార్గెట్ పెట్టుకోవాలని సూచించారు... ఇప్పటినుండి ప్రతినెల వైద్య శాఖ పై సమీక్ష నిర్వహిస్తానని వచ్చే నెల నిర్వహించే సమీక్షలో పని విధానం పై మార్పు రావాలన్నారు...భవిష్యత్తులో ప్రతి వ్యక్తి హెల్త్ ట్రాక్ రికార్డు నమోదు చేయాలని ప్రతి గ్రామపంచాయతీలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండేలా ప్రయత్నిస్తామన్నారు...



చౌటుప్పల్ పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో డాక్టర్లు సిబ్బంది పేషంట్ల పై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ట్రీట్మెంట్ చేయకుండా ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి స్థానిక నాయకులు తీసుకురాగా వెంటనే యాదాద్రి జిల్లా డిసిహెచ్ఎస్ చిన్న నాయక్ కు ఫోన్ చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు.. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చిన ఏ ఒక్క పేషంటును కూడా ప్రైవేటు ఆసుపత్రులకు రిఫర్ చేయొద్దన్నారు..మునుగోడు నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేసుకుంటామన్నారు.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది కొరతకు సంబంధించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు.. ప్రజా వైద్యం విషయంలో ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ వైద్యాధికారులు కలిసి టీం వర్క్ గా పని చేయాలని, మీకు మౌలిక సదుపాయాలు కల్పించే బాధ్యత నాదని, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన పేషెంట్లకు నాణ్యమైన వైద్యాన్ని అందించి ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకాన్ని కలిగించే బాధ్యత మీదన్నారు... ఈ సమీక్ష సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా డి ఎం హెచ్ ఓ మనోహర్, నల్గొండ డిప్యూటీ డిఎంహెచ్వో వేణుగోపాల్ రెడ్డి, దేవరకొండ ఇన్చార్జి డిప్యూటీ డి ఎం హెచ్ ఓ కళ్యాణ చక్రవర్తి, చౌటుప్పల్ డిప్యూటీ డిఎంహెచ్వో యశోద, వివిధ మండలాల మెడికల్ ఆఫీసర్లు, ఎమ్ ఎల్ హెచ్ పి ఎస్ లు, వివిధ మండలాలకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు...

## బిజెపి సీనియర్ నాయకులు వెంకటేష్ యాదవ్ మృతికి సంతాపం తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి



**సంస్థాన్ నారాయణపురం, జూన్ 27( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర%శీ% మండల చిమిర్యాల గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ మండల మాజీ ఉపాధ్యక్షులు ఆరుట్ల వెంకటేష్ యాదవ్ అనారోగ్యంతో మృతి చెందాడు. వారి మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించిన నారాయణపురం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప్పల లింగస్వామి, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జక్కలి ఐలయ్య యాదవ్, చిమిర్యాల మాజీ సర్పంచ్ దోనూరు జైపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ కోన్ రెడ్డి నరసింహ, రాచకొండ రమేష్ బాబు, యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, ఆంధ్రప్రభ రిపోర్టర్ కొండ శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి సీనియర్ నాయకుడు ఆరుట్ల వెంకటేష్ మృతి

భారతీయ జనతా పార్టీకి తీరని లోటు


సంతాపం తెలిపిన బిజెపి నాయకులు



**సంస్థాన్ నారాయణపురం, జూన్ 27( ప్రభాత సూర్య ):** యాదాద్రి భువనగిరి జిల్లా
సంస్థాన్ నారాయణపురం మండలం చిమిర్యాల గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ మాజీ మండల ఉపాధ్యక్షులు ఆరుట్ల వెంకటేష్ యాదవ్ గత కొన్ని నెలలుగా అనారోగ్యంతో యశోద హాస్పిటల్, నిమ్స్ హాస్పిటల్ లల్లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి 10 గంటలకు తుది శ్వాస విడిచారు. వెంకటేష్ విద్యార్థి దశనుండే జాతీయవాద భావజాలం కలిగిన వ్యక్తి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేవాడు.అతడికి కూతురు, కుమారుడు ఉన్నారు. తీవ్ర అనారోగ్య సమస్యల వల్ల చిన్నతనం లోనే వెంకటేష్ చనిపోవడంతో కుటుంబం సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. చిమిర్యాల గ్రామంలో విషాద మాయమైనది. వెంకటేష్ మృతదేవాహానికి చిమిర్యాల బీజేపీ నాయకులు పూల మాల వేసి సంతపాన్ని తెలియజేసిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డా, గంగిడి మనోహర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనూరు వీరారెడ్డి,బీజేపీ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపాల్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి (మన్సురాబాద్ ),నవజీవన్ రెడ్డి (హయత్నగర్ ),బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కలి రాజు యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు బచ్చనబోయిన దేవేందర్ యాదవ్, జిల్లా కౌన్సిల్ నంబర్ దానోజు వెంకటాచారి. ఈ కార్యక్రమంలో గడ్డం స్వామి,వంగరి రఘు, సుర్వి వెంకటేశం గౌడ్, కేసాని యాదయ్య, ఉప్పల రమేష్, దండుగుల నగేష్,సుర్వి రవీందర్,కొత్త మాధవరెడ్డి, సుర్వి ప్రకాష్,బోడ శివ,సుర్వి దయాకర్,బోడ అనిల్,సుర్వి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కురుబల సంక్షేమానికి తోడ్పాటు అందించండి

**కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్పను మర్యాదపూర్వకంగా కలిసిన... ఆవుల కృష్ణయ్య**



**అనంతపురం, జూన్ 27( ప్రభాత సూర్య ):** కురవ కార్పొరేషన్ చైర్మన్ హోదాలో జిల్లాకు మొట్టమొదటిసారిగా వచ్చిన సందర్భంగా మాసినేని గ్రాండ్ హోటల్లో శుక్రవారం కురవ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్పను మర్యాదపూర్వకంగా కలిసిన అనంతపురం టిడిపి బీసీ సెల్ పార్లమెంటు అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య పుష్పగుచ్చం అందజేసి ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆవుల కృష్ణయ్య మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి కురవల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన సానుకూలంగ్గా స్పందించి కురబలు ఎదుర్కొంటున్న సమస్యలపై తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కురవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి బ్యాళ్ల నాగేంద్ర, నాగరాజు రాము తదితరులు పాల్గొన్నారు.


## మున్సిపల్ కమిషనర్గా జి. శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ




**మిర్యాలగూడ, జూన్ 27 (ప్రభాత సూర్య):** మిర్యాలగూడ మున్సిపల్ కమిషనర్గా జి.శ్రీనివాస్ శుక్రవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కమిషనర్ల బదిలీల్లో భాగంగా ఆయన ఇటీవల హైదరాబాదులోని జిహెచ్ఎంసిలో జాయింట్ కమిషనర్గా సేవలందించి, ఇప్పుడు మిర్యాలగూడకు బదిలీ అయ్యారు. ఇప్పటివరకు మిర్యాలగూడ మున్సిఎల్ కమిషనర్గా విధులు నిర్వహించిన ఎండీ.యూసుఫ్ హైదరాబాద్ మున్సిపల్ పరిపాలన డైరెక్టరేట్కి రిపోర్టు చేసినట్లు సమాచారం. ఆయనకు ఇంకా కొత్త పోస్టింగ్ ఇవ్వలేదు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజల అవసరాలు, అభివృద్ధి లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని ప్రజాప్రతినిధులు మరియు అధికారుల సహకారంతో మున్సిపాలిటీలో సంక్షేమ, అభివృద్ధి పనులను సమర్థంగా నిర్వహిస్తాను, అని తెలిపారు. అధికార పరంగా అనుభవజ్ఞుడైన శ్రీనివాస్ నేతృత్వంలో మున్సిపాలిటీ మరింత పురోగతి సాధిస్తుందన్న అన్నారు.

## బీఎల్ఓగా ట్రైనింగ్ పూర్తి చేయడం సంతోషకరం

**– బీజేఎంసీ జూనియర్ అసిస్టెంట్ సూర్యప్రకాష్**



**గండిపేట్, : సూర్య ప్రతినిధి** బీఎల్ఓగా ట్రైనింగ్ పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ జూనియర్ అసిస్టెంట్ సూర్య ప్రకాష్ అన్నారు. బీఎల్ఓ ట్రైనింగ్ కు ఢిల్లీ వెళ్లిన ఆయన శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం ట్రైనింగ్ సర్టిఫికేట్ ను అందుకున్నారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. బీఎల్ఓగా ట్రైనింగ్ పూర్తి చేయడం ఆనందంగా ఉందని వివరించారు.

## లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం...

రైతులకు ఉపశమనం కల్పించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

దామరభినపల్లి రైతుల కృతజ్ఞతలు 63 కెవి ట్రాన్స్‌ఫార్మర్‌తో సమస్యకు శాశ్వత పరిష్కారం



మర్రిగూడ, జూన్ 27 (ప్రభాత సూర్య) : మర్రిగూడ మండలానికి చెందిన దామరభినపల్లి గ్రామ రైతులు గత కొంతకాలంగా ఎదుర్కొంటున్న లో వోల్టేజ్ సమస్యకు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శాశ్వత పరిష్కారం కల్పించారు. దీనిపై రైతులు ఆనందం వ్యక్తం చేశారు. సరంపేట తండా పరిధిలో ఉన్న వ్యవసాయ భూముల్లో విద్యుత్ సరఫరా అసమర్థత కారణంగా దామరభినపల్లి మరియు దామర భీమవరం పల్లి గ్రామాల రైతులు సాగు పనుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి తక్షణమే స్పందించి, విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీచేయగా 63 కె.వి. సామర్థ్యం గల కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ సిలువేరు విష్ణు మాట్లాడుతూ రైతులకు ఊరట కలిగించిన అభివృద్ధి చర్య. సమస్యను ఎమ్మెల్యే తెలియజేయగానే వెంటనే స్పందించి పరిష్కారం కల్పించారని తెలిపారు. రైతులు కొబ్బరికాయ కొట్టి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈ నాగిరెడ్డి, వంశీల వెంకటరెడ్డి, నడిమింటి రవి కృష్ణారెడ్డి, సిలువేరు నరసింహ, లైన్మెన్ వెంకన్న, రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు. రైతులు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ ఇలాంటి వేగవంతమైన స్పందన గ్రామీణ రైతుల జీవనోపాధికి దిక్సూచి అని ప్రశంసించారు.

## పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షునిగా 4వ సారీ ఏకగ్రీవంగా ఎన్నికైన మంచాల జంగయ్య



**సంస్థాన్ నారాయణపూర%శీ%, జూన్ 27( ప్రభాత సూర్య ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల జనగాం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షునిగా 4వ సారీ మంచాల జంగయ్యని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. డైరెక్టర్లుగా కొండూరి ముత్యాలు, కొండూరి యాదగిరి,బైకని ఐలయ్య, బెల్లంకొండ నర్సింహా, వేమిరెడ్డి రామిరెడ్డి, కొండూరు చంద్రమ్మ, మంచాల నర్సింహా, బొద్రబోయిన శ్రీను, భొద్రబోయిన ఎల్లయ్యల ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి మామిళ్ళ గోపాల్ రెడ్డి, కోందురి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీలకు రెగ్యులర్ కార్యదర్శులను నియమించాలి : దోమల వెంకన్న



**మర్రిగూడ, జూన్ 27 (ప్రభాత సూర్య):** ప్రజల సమస్యలను సమయానికి పరిష్కరించాలంటే గ్రామ సచివాలయంలో రెగ్యులర్ కార్యదర్శుల నియామకం తప్పనిసరి అని మర్రిగూడ మండల టీడీపీ అధ్యక్షులు దోమల వెంకన్న యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పరిపాలన ప్రజలకు అందుబాటులో ఉండేలా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసినా, ఖాళీగా ఉన్న కార్యదర్శి పోస్టుల్ని ఇప్పటివరకూ భర్తీ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. తాత్కాలిక పోస్టింగులతో మొక్కుబడిగా వ్యవహరిస్తే, గ్రామ అభివృద్ధి సాధ్యం కాదు. నియమించబడే కార్యదర్శులు ప్రజల అవసరాలను అర్థం చేసుకుని సేవ చేయగల నిబద్ధత ఉండాలని పేర్కొన్నారు. దామరభీమనపల్లి, నల్గొండ జిల్లాలో అతిపెద్ద పంచాయతీగా ఉన్న దామరభీమనపల్లి గ్రామంలో సుమారు 3000 మందికి పైగా జనాభా ఉన్నా కూడా, అక్కడ తాత్కాలిక కార్యదర్శి ద్వారా మాత్రమే సేవలు అందిస్తున్నారని తెలిపారు. ఈ పరిస్థితి ప్రజలకు అనేక సమస్యలు తెచ్చిపెడుతోందని, ముఖ్యంగా సంక్షేమ పథకాలు, సర్టిఫికెట్లు, అభివృద్ధి పనుల అమలు ఆలస్యం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించాలని గ్రామానికి సర్పంచ్‌తోపాటు పూర్తి స్థాయిలో కార్యదర్శిని నియమించడం ద్వారా పరిపాలన మరింత బలపడుతుందని వెంకన్న పేర్కొన్నారు. ఇది ప్రభుత్వం యొక్క బాధ్యతే కాదు... ప్రజల పట్ల నిబద్ధతనూ ప్రతిబింబిస్తుందని స్థానిక ఎమ్మెల్యే కూడా ఈ విషయంలో చొరవ చూపాల్సిన అవసరం ఉందని సూచించారు. గ్రామీణ పరిపాలనను నిర్లక్ష్యం చేయవద్దునే డిమాండ్ మర్రిగూడ మండలంలో కొత్త చర్చకు దారి తీస్తోంది.

## పెద్దపల్లి జిల్లాలో ఆర్ఓబి మరమ్మత్తు పనులతో నిలిచిపోయిన పలు రైళ్ళు....

**ఇక్కట్ల పాలైన ప్రయాణికులు**

**పెద్దపల్లి :** పెద్దపల్లిలోని కునారం రైల్వే బ్రిడ్జి పనుల మరమ్మత్తులతో బల్లార్షా, కాజీపేట రైల్వే జంక్షన్ల మధ్య రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దపల్లి శివారులో నిర్మాణం చేపడుతున్న రైల్వే బ్రిడ్జి నిర్మాణానికి ఉపయోగించే ఇనుప గార్డర్లు క్రాక్ ఇచ్చి బిడ్జి కొంత భాగం కిందికి వంగిపోయింది. రైల్వే పనులు నిర్వహిస్తున్న సిబ్బంది రైల్వే అధికారులకు సమాచారం ఇవ్వడంతో అధికారులు గంటపాటు విద్యుత్ సరఫరాను నిలిపి వేసి బ్రిడ్జి నిర్మాణ పనులకు అనుమతి ఇచ్చారు. కుంగిపోయిన భాగం ఎంతకు పైకి లేవకపోవడంతో గంటల తరబడి రైల్వే ట్రాక్ పై ట్రైన్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. పెద్దపల్లి సమీపంలోని రాఘవపూర్, కొలనూరు, ఓదెల, జమ్మికుంట మ, ఉప్పల్ రైల్వే స్టేషన్లలో పలు రైళ్ళు నిలిచిపోయాయి. భాగ్యనగర్, ఇంటర్సిటీ, సంపర్ క్రాంతి తదితర ట్రైన్లు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి రైళ్లలో అవస్థలు పడుతున్నారు. రైల్వే ట్రాక్ లకు సమీపంలో రోడ్డు మార్గం ఉన్న చోట్ల ప్రయాణికులు ట్రైన్ వదిలేసి నడుస్తూ వచ్చి బస్సుల కోసం రోడ్లపై ఎదురుచూశారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు తక్షణమే మరమ్మత్తులు పూర్తిచేసి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# ఆధైర్య పడవద్దు నిరుత్సాహానికి గురికావద్దు





ముఖ్య కార్యకర్తల సమావేశంలో

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు- చలమల్ల కృష్ణారెడ్డి

**సంస్థాన్ నారాయణపురం, జూన్ 27( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం దామరలోని వ్యక్తిగత క్యాంపు కార్యాలయం నందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ముందు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ..... కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ.... ఎన్నికలకు సన్నద్ధం కావాలని కార్యకర్తలకు సూచించారు. నాయకులు కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి అని తెలియజేస్తూ... అందరూ భేదాభిప్రాయాలు పక్కనపెట్టి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేయాలని తెలియజేశారు... ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి లోటుపాటులు లేకుండా అర్హులకు అందేలా కృషి చేయాలని నాయకులకు కార్యకర్తలకు తెలియజేశారు.... కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలియజేస్తూ ఎవరు..ఆధైర్య పడవద్దు... నిరుత్సాహానికి గురికావద్దని.... కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో గెలుపు కోసం అహర్నిశలు కష్టపడిన కార్యకర్తలకు రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో అభ్యర్థులుగా అవకాశం కల్పించి.... కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అభివృద్ధికి పాటుపడాలని మరియు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక విషయంలో అవకతవకలను గుర్తించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని అలాగే వర్గ బేధాలకు తావులేకుండా చూడాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి తెలియజేశారు. ఎమ్మెల్యే దృష్టికి రాకుండా...మండల స్థాయిలో కొందరు నాయకులు సంక్షేమ పథకాల అమలులో తలదూరుస్తూ భూ వివాదాలలో జోక్యం చేసుకుంటూ.... అధికారులను ఇబ్బంది పెడుతూ చలామణి అవుతున్నారు... కాంగ్రెస్ పార్టీని బలహీనపరుస్తున్నారు ఇలాంటి విషయాలను ఏమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఎప్పుడు ప్రోత్సహించరని కార్యకర్తలు తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో... మండల నాయకులు గూడూరు వెంకటరెడ్డి, రాసమల్ల యాదయ్య, బిట్టు సత్యనారాయణ, చాపల నరసింహ సిలివేరు నరసింహ , చిక్క నరసింహ, మైలారం రాములు, సింగు సంజీవరెడ్డి,చాడ శ్రీను,యాదయ్య, తదితరులు పాల్గొన్నారు

# రాచకొండలో రిజర్వాయర్‌ను ఏర్పాటు చేసి కృష్ణా నీటిని అందించాలి





బీజేపీ ని నిరోధించడానికే ఇతరులతో కలిసి వెళ్ళాం.

నక్సలైట్లు ఆయుధాలు విడి జనంలోకి రావాలి.

సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి.

**సంస్థాన్ నారాయణపూర , జూన్ 27( ప్రభాత సూర్య ):** డిండి లిఫ్ట్ ఇరిగేషన్ లో భాగంగా శివన్నగూడెంలో నిర్మించిన చర్లగూడెం ప్రాజెక్టు నుండి లిఫ్ట్ ద్వారా రాచకొండలో రిజర్వాయర్ ఏర్పాటుచేసి సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు సాగునీరు అందించాలని సిపిఐ జాతీయ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల మహాసభను మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ఈ మహాసభకు సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు ముఖ్య అతిదులుగా హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ...చంద్రబాబు, నితీష్ కుమార్ బీజేపీ వ్యతిరేక ఫ్రంట్ లో పనిచేశారని కానీ ప్రస్తుతం వారి మద్దతుతోనే బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని అన్నారు.అధికారం కోసం పార్టీలు మారుతున్నారని ఆయన గుర్తుచేశారు.లెఫ్ట్ పార్టీలు కలిసి ఒకే జెండా ఒకే గుర్తుతో ముందుకు పోవాలని అభిప్రాయపడ్డారు.కమ్యూనిస్ట్ లు ఐక్యం ఐతే ప్రజలు అంతా మన వైపు ఉండే అవకాశం ఉందని అన్నారు.ప్రపంచ దేశాలలో కమ్యూనిస్ట్ లే కీలంకంగా ఉన్నారని గుర్తు చేశారు.ప్రజావిశ్వాసం పొందెందుకు కమ్యూనిస్ట్ లు అంత ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఆయుధాలు వదిలి నక్సలైట్లు జనంలోకి వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు.వామపక్ష పార్టీల ఐక్యత కోసం నక్సలైట్లు పని చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ... మునుగోడు నియోజకవర్గానికి సాగునీరు అందించే శివన్నగూడెం ప్రాజెక్టును పూర్తిచేసి సంస్థాన్ నారాయణపురం, చౌటుప్పల్ మండలాలకు కృష్ణ సాగునీటిని అందించాలని డిమాండ్ చేశారు. అయోధ్య పేరు చెప్పే అధికారంలోకి వచ్చిన బిజెపి చరిత్ర లేని పార్టీ అని విమర్శించారు. మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా బిజెపి ప్రభుత్వం క్రూరంగా వ్యవహరిస్తుందని చనిపోయిన నక్సలైట్ల శవాలను కూడా కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా రాక్షసంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అన్నియ్య హామీలను నెరవేర్చే బాధ్యత ఆ ప్రభుత్వంపై ఉందని,ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే టిఆర్ఎస్ ప్రభుత్వం చెప్పినట్లే ప్రజలు బుద్ధి చెప్తారని అన్నారు.ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, యానాల దామోదర్ రెడ్డి,బొల్లమోని సత్యనారాయణ, మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి ఇమ్రాన్,మండల సహాయ కార్యదర్శులు చిలువేరు అంజయ్య, పొట్ట శంకరయ్య, కలకొండ సంజీవ, నాయకులు జగన్, కందుల లింగమ్మ, దేశిడి నరేందర్ రెడ్డి, రుద్ర రాములు, పల్లె మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ వ్యాప్తంగా క్లస్టర్ స్కూళ్ళ అభివృద్ధి

- మండలానికి ఐదు నుండి ఆరు క్లస్టర్ స్కూళ్ల అభివృద్ధి కి ప్రణాళికలు
- 285 కోట్ల వ్యయంతో 43 పాఠశాలలు అభివృద్ధి చేసుకుని, 20000 మంది విద్యార్థులకు అత్యాధునిక మౌలిక వసతులతో నాణ్యమైన విద్యను అందించే విధంగా ప్రణాళికలు
- ముందుగా మండలానికి ఒక పాఠశాల ను పైలెట్ ప్రాజెక్టు గా తీసుకుని అభివృద్ధి
- విద్యాశాఖ అధికారులతో సమీక్షా సమావేశంలో కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**మునుగోడు, జూన్ 27( ప్రభాత సూర్య):** మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో విద్యా బోధన, మౌలిక సదుపాయాలు, విద్యార్థుల ఎన్రోల్మెంట్, ఒక్కో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, మండలాల వారీగా ఉన్న పాఠశాలలు వాటిలో చదువుతున్న విద్యార్థుల సంఖ్య, వివిధ పాఠశాలల మధ్య దూరం, ఎక్కువ విద్యార్థులు ఉన్న స్కూళ్లు ఎన్ని? తక్కువ విద్యార్థులు ఉన్న స్కూళ్లు ఎన్ని? ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు తగ్గడానికి కారణాలు ఏంటి? అనే ఇత్యాది అంశాల పై నల్గొండ యాదాద్రి జిల్లా విద్యాశాఖ అధికారులతో మునుగోడు లోని క్యాంపు కార్యాలయం లో సమీక్ష సమావేశం నిర్వహించారు మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి. మండలాల వారీగా ప్రాథమిక, ప్రాథమికొన్నత, ఉన్నత పాఠశాలల పనితీరు, వసతుల పై సుదీర్ఘంగా చర్చించారు.ప్రభుత్వ బడుల్లో విద్యాప్రమాణాలు పెంచడానికి ఎటువంటి మౌలిక సదుపాయాల ను అభివృద్ధి చేసుకోవాలనే విషయం పై ఈ సమావేశం లో ప్రణాళికలు రూపొందించారు... ప్రణాళిక ప్రకారం ప్రతి మండలంలో ఐదు నుండి ఆరు పాఠశాలలను క్లస్టర్ పాఠశాలలుగా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేసుకోవాలని నిర్ణయించారు. మునుగోడు మండలంలో 5, చండూరు మండలంలో 5, గట్టుప్పల్ మండలంలో 4, నాంపల్లి మండలంలో 6, చౌటుప్పల్ మండలంలో 12, నారాయణపూర్ మండలం లో 7 స్కూళ్లను కలుపుకొని మొత్తం 43 క్లస్టర్ పాఠశాలలను అత్యాధునిక మౌలిక వసతులతో అభివృద్ధి చేసుకుంటే 20,000 మంది విద్యార్థిని విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించవచ్చని వీటి అభివృద్ధికి గాను 285 కోట్ల రూపాయలు ఖర్చవుతుందని ప్రణాళికలు రూపొందించారు... ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా 330 పాఠశాలల్లో 9, 900 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఈ 43 క్లస్టర్ పాఠశాలల ను అభివృద్ధి చేసుకున్నట్లయితే 20వేల మంది విద్యార్థులకు అత్యాధునిక వసతులతో నాణ్యమైన విద్యను అందించవచ్చని పేర్కొన్నారు.. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే దిశగా ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా క్లస్టర్ స్కూళ్ళ ను అభివృద్ధి చేసుకోవాలని అన్నారు.. ఈ సమీక్ష సమావేశంలో నల్గొండ డీఈవో బిక్షపతి, యాదాద్రి భువనగిరి జిల్లా డీఈవో సత్యనారాయణ, మునుగోడు చండూరు నాంపల్లి గట్టుప్పల్ మర్రిగూడెం నారాయణపురం చౌటుప్పల్ మండలాల ఎంఈఓ లు పాల్గొన్నారు.....

# ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేయాలి





## ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మాసాయిపేట యాదగిరి

**గండిపేట్, : సూర్య ప్రతినిధి** ఎమ్మార్పీఎస్ 31 వ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని, ప్రతి బస్తి నుండి మాదిగలను పెద్ద ఎత్తున పాల్గొనేలా కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ మాసాయిపేట యాదగిరి మాదిగ అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్ దేవ్ పల్లి డివిజన్ లోని ప్రేమావతి పేట్ గ్రామంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా యాదగిరి మాదిగ పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశం ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పోతురాజు యాదయ్య మాదిగ, నాన్నగారి రాంచందర్ మాదిగల ఆధ్వర్యంలో జై భీమ్ జై రామ్ సంఘం భవనంలో అధ్యక్షులు గోల్కొండ రాజు కుమార్ మాదిగ, ప్రధాన కార్యదర్శి ఎడ్లకాడి సూర్యం మాదిగల సమక్షంలో జరిగింది. మాదిగలమని చెప్పుకునేందుకు బాధపడ్డ స్థాయి నుండి మాదిగలమని చెప్పుకొనే గొప్ప స్థాయికి రావడానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితమేనన్నారు. ముప్పైఏండ్ల పోరాటంలో అనేక రకాల ఇబ్బందులు, అణచివేతలు, నిర్బంధాలు, అరెస్టులు, జైలు జీవితాలు భరించి జాతికి న్యాయం కోసం అలుపెరుగని పోరాటంతో అంటరాని మాదిగ జాతిని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టిన చరిత్ర మంద కృష్ణ మాదిగ అన్నగారిదేనన్నారు. ఎమ్మార్పీఎస్ ప్రేమావతి పేట్ గ్రామ అధ్యక్షులుగా ఎడ్లకాడి చంద్ర శేకర్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా గోల్కొండ శ్రీహరి మాదిగ, ఉపాధ్యక్షులుగా కాసారం మహేష్ మాదిగ, మంగలారం బాబురావు మాదిగ, కోశాధికారిగా కవ్వగూడెం గౌతమ్ మాదిగ, ఆర్గనైజర్ గా కవ్వగూడెం జనార్ధన్ మాదిగ, జాయింట్ సెక్రటరీలుగా జి.అక్షయ్ మాదిగ, ఎ.సూర్య అంకిత్ మాదిగ, మెంబెర్స్ గా గోల్కొండ ద్వారకేష్ మాదిగ, బండారి వికాస్ మాదిగ, దాసరి ప్రేమ్ సాగర్ మాదిగ, గొల్లపల్లి అనిరుద్ మాదిగ, ఎరుకలి నర్సింగ్ రావు మాదిగ, గడ్డం హరి మాదిగలను నియమించారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ లేవి రాజ్ మాదిగ, బిఆర్ సుమన్ మాదిగ, ఆగపల్లి నర్సింహా మాదిగ, గడ్డం చింటు మాదిగ, ఎడ్లకాడి అనిల్ మాదిగ, టి.మోజెస్ మాదిగ తదితరులు ఉన్నారు.

# నన్ను టార్గెట్ చేసింది వారే



**వరంగల్ :** మావోయిస్టుల లేఖపై మంత్రి సీతక్క స్పందించారు. ములుగు జిల్లా ఏటూరు నాగారంలో సీతక్క మీడియాతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ లేఖ మావోయిస్టు పార్టీ ఇచ్చిందా.. లేదా.. అన్న దానిపై స్పష్టత లేదన్నారు. అయితే కొన్ని మీడియా సంస్థలు, ఒక రాజకీయ పార్టీ పత్రిక మాత్రం లేఖలో లేని అంశాలపై కామెంట్స్ చేస్తున్నాయని సీతక్క మండిపడ్డారు. మహిళ అని కూడా చూడకుండా.. మావోయిస్టుల లేఖ ముసుగులో.. తనపై అసభ్య పదజాలాన్ని వాడుతూ తమ రాజకీయ కక్షను తీర్చుకుంటున్నాయని సీతక్క చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. 'మహిళపై అసభ్య పదజాలాన్ని వినియోగించడం ఆవేదన కలిగిస్తోంది. ఒక మహిళను పట్టుకుని సిగ్గు లేదా అని రాయడం ఏం జర్నలిజం. నేను ఎన్నడూ ప్రజలకు దూరంగా లేను.. వారంలో రెండు మూడు రోజులు ములుగు, ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్నాను. నన్ను ఎన్నికల్లో ఓడించాలని ఎన్నో శక్తులు పని చేశాయి. అవే శక్తులు ఇప్పుడు నన్ను టార్గెట్ చేస్తున్నాయి. ఒక కోయ మహిళలకు జనరల్ పోర్ట్ ఫోలియో దక్కడాన్ని బీఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోంది. అందుకే నా వ్యక్తి గత ప్రతిష్టను దెబ్బతీసేలా తప్పుడు వీడియోలు సృష్టిస్తున్నారు' అని మండిపడ్డారు. 'జీవో 49 తో అటవి బిడ్డలు నష్టపోతారని దాన్ని వ్యతిరేకించాను. మా జీవితాలకు గొడ్డలి పెట్టు లాంటి జీవోను రద్దు చేయాలని కోరాను. గిరిజన సంక్షేమ మంత్రి కాకున్నా.. పార్టీలకు అతీతంగా ఎస్టీ ఎమ్మెల్యేలందరితో సమావేశమై జీవో 49 ను రద్దు చేయాలని తీర్మానించాము. ఏ హోదాలో, ఏ స్థాయిలో ఉన్నా నేను ఆదివాసి అడవి బిడ్డనే. వారి సంక్షేమం, అభివృద్ధి కోసమే నా జీవితం అంకితం. ఆదివాసులకు మేలు చేసేలా అధికారాన్ని వినియోగిస్తున్నాను' అని చెప్పుకొచ్చారు. 'ములుగు, భద్రాద్రి కొత్తగూడెం ఘటనలు నా దృష్టి రాగానే అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ గారితో, ప్రిన్స్ పల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ – పీసీసీఎఫ్ సువర్ణ గారితో స్వయంగా మాట్లాడాను. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు జరగకుండా చర్యలు చేపడుతామని వారు హామీ ఇచ్చారు. నా నియోజకర్గంలో కొంతమంది అడవి అధికారులు ఆదివాసి గుడిసెల మీద దాడి చేశారు. ఈ ఘటన నా దృష్టికి రాగానే అధికారులకు ఫోన్ చేసి వెనక్కు పంపించి వేశాను. సొంత నిర్ణయాలతో అధికారులు తప్పు చేస్తే చర్యలు తీసుకుంటాము. ఆదివాసులు, అట్టడుగు వర్గాలు, కష్టాల్లో ఉన్న ప్రజల కోసం నిలబడతాం' అని సీతక్క స్పష్టం చేశారు. 'బీఆర్ఎస్ హయాంలో ఆదివాసులపై దాడులు చేశారు.. ఇప్పుడు లేని ప్రేమ ఒలక బోస్తున్నారుచంటి పిల్లల తల్లులను జైల్లో పెట్టారు.. చెట్లకు కట్టేసి కొట్టారు. ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారు. పదేండ్ల అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పోడు సమస్యలను పరిష్కరించలేదు. మీ హయాంలో అడవి బిడ్డలకు ఇండ్లు ఇస్తే సమస్యలే ఉత్పన్నం కాకపోవు. ఒక ఆదివాసి బిడ్డను టార్గెట్ చేశామని సంబరపడుతున్నారు. మావోయిస్టుల లేఖను అడ్డం పెట్టుకొని నన్ను అవమానిస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నారు. నన్ను ఓడించేందుకు వంద కోట్లు ఖర్చు చేశారు.. అయినా ములుగు ప్రజలు నాకు రికార్డు మెజార్టీ ఇచ్చారు' అని తెలిపారు

# మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడిన ఆరుగురు అరెస్ట్

**33 బైక్‌లు స్వాధీనం**

**పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**




**కరీంనగర్ :** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడిన ఆరుగురు దొంగలను అరెస్ట్ చేసి, వారి నుండి మొత్తం 33 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శుక్రవారం తెలిపారు. కరీంనగర్ టూ టౌన్ పరిధిలోని పద్మనగర్‌లో టూ టౌన్ మరియు సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా శుక్రవారం ఉదయం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, రెండు మోటార్ సైకిళ్ళపై ట్రిపుల్ రైడింగ్ లో వెళ్తున్న ఆరుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసు కుని విచారించగా, వీరు కరీంనగర్ కమిషనరేట్ మరియు సిరిసిల్ల జిల్లా పరిధిలో మొత్తం 12,27,000 రూపాయల విలువగల, 33 మోటార్ సైకిళ్లను దొంగిలించినట్లు తేలింది. ఈ దొంగతనాలకు సంబంధించి మొత్తం ఆరు పోలీస్ స్టేషన్లలో 22 కేసులు నమోదు చేసినట్లు పోలీస్ కమిషనర్ వెల్లడించారు.

**పోలీస్ స్టేషన్ల వారీగా కేసుల సంఖ్య మరియు స్వాధీనం చేసుకున్న బైక్‌ల వివరాలు:**

కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్: 6 కేసులలో 11 బైక్‌లు స్వాధీనం. కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్: 8 కేసులలో 9 బైక్‌లు స్వాధీనం. కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్: 1 కేసులో 1 బైక్ స్వాధీనం. కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్: 2 కేసులలో 2 బైక్‌లు స్వాధీనం. కరీంనగర్ కొత్తపల్లి పోలీస్ స్టేషన్: 3 కేసులలో 3 బైక్‌లు స్వాధీనం. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పోలీస్ స్టేషన్: 2 కేసులలో 2 బైక్‌లు స్వాధీనం. సరైన వివరాలు లేని, 5 బైక్‌లు స్వాధీనం.

**పట్టుబడిన నిందితుల వివరాలు:**

పంతుల నవీన్ మహబూబ్‌నగర్ జిల్లా, వెంకిచర్ల నివాసి. పెంటి బాలు కరీంనగర్ జిల్లా, గన్నేరువరం, చొక్కారావుపల్లె నివాసి. పెద్ది నాగరాజు సిరిసిల్ల జిల్లా, చందుర్తి, మల్యాల నివాసి. చిందం సాయి ప్రసాద్ ముత్తారం మంథని మండలం, కేశినపల్లి గ్రామ నివాసి. తోట మధు కరీంనగర్ జిల్లా, గంగాధర మండలం, లింగంపల్లి గ్రామ నివాసి. కుంబాల సురేష్ సిరిసిల్ల జిల్లా, ఇల్లంతకుంట నివాసి. ఈ అరెస్టులతో మోటార్ సైకిల్ దొంగతనాలకు అడ్డుకట్ట పడిందని, ప్రజలు తమ వాహనాల భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

ఈ నిందితులను పట్టుకుని, దొంగిలించబడిన 33 బైకులు స్వాధీనం చేయడంలో కృషి చేసిన టౌన్ ఏసీపీ వెంకటస్వామి , టూ టౌన్ ఇన్స్పెక్టర్ సృజన్ రెడ్డి , సీసీఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కోటేశ్వర్ వన్ టౌన్, జాన్ రెడ్డి త్రీ టౌన్ మరియు ఇతర సిబ్బందిని పోలీసు కమిషనర్ రివార్డు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

## నా భర్తను రప్పించండి

**ఖమ్మం :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో ఒక ఎన్నారై పెళ్లి వివాదం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. భర్త నవీన్‌రెడ్డి తనను వేధిస్తున్నాడని.. తిరిగి అమెరికాకు తీసుకెళ్లడం లేదని భార్య దుబ్బాక శ్రావ్య ఆరోపించారు. సంతానం విషయంలో తనపై నిందలు వేసి వైద్య పరీక్షలు చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసును విచారిస్తున్న ఇల్లెందు సీఐ సత్యనారాయణను నవీన్‌రెడ్డి తల్లిదండ్రుల ఫిర్యాదుతో ఐజీ సస్పెండ్ చేయడాన్ని శ్రావ్య తప్పుబట్టారు. పోలీసు ఉన్నతాధికారులు నిందితులకు కొమ్ముకాస్తున్నా రని మండిపడ్డారు. ఓ ఎన్నారై పెళ్లి వివాదంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు సీఐ సత్యనారాయణ సస్పెన్షన్‌కు గురైన సంగతి తెలిసిందే. ఇల్లెందుకు చెందిన పెండ్లి నవీన్‌రెడ్డికి హైదరాబాద్‌లోని చెంగిచెర్లకు చెందిన దుబ్బాక శ్రావ్యతో 2023 జూన్‌లో వివాహం జరగ్గా.. పెళ్లి తర్వాత కొంతకాలం పాటు అమెరికాలోని డల్లాస్‌లో వీరి కాపురం సాగింది. అమెరికాలో ఉన్న సమయంలో నవీన్‌రెడ్డి, శ్రావ్యకు సమాచారం ఇవ్వకుండానే పలువురు డాక్టర్లతో ప్రెగ్నెన్సీకి సంబంధించిన కొన్ని పరీక్షలు చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ తర్వాత శ్రావ్యను హైదరాబాద్‌కు పంపించారు. సుమారు ఏడాది గడిచినా నవీన్‌రెడ్డి శ్రావ్యను తిరిగి అమెరికాకు తీసుకెళ్లలేదు. దీంతో ఆమె ఇల్లందు పోలీసులను ఆశ్రయించగా.. కేసు విచారణ చేపట్టిన సీఐను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

## మైలార్ దేవ్ పల్లి ఇన్ స్పెక్టర్ నరేందర్




**గండిపేట్, : సూర్య ప్రతినిధి** మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితాలు చిత్తు అవుతాయని మైలార్ దేవ్ పల్లి పోలీసుస్టేషన్ ఇన్ స్పెక్టర్ నరేందర్ అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా రాజేంద్రనగర్ మండల తెలంగాణ రికగ్నైజేషన్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ (ట్రెస్మా) ఆధ్వర్యంలో మధుబన్ కాలనీ కాకతీయ పాఠశాల క్రీడా ప్రాంగణంలో విద్యార్థులు మత్తు పదార్థాలు వినియోగిస్తే జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా సీఐ నరేందర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజలు, యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని అన్నారు. మత్తు మానవత్వాన్ని మింగేస్తుందన్నారు.

సమాజంలో మత్తు వ్యసనం రోజురోజుకు పెరుగుతోందని, మత్తు వ్యక్తిని శారీరకంగా, మానసికంగా కుంగదీయడంతో పాటు ఆర్థికంగా నష్టపరుస్తుందని అన్నారు. మానవ జీవితానికి డ్రగ్స్ అత్యంత ప్రమాదకరమని, కుటుంబ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తుందని హెచ్చరించారు. వ్యవసనాలకు బానిస కావొద్దని సూచించారు. రాజేంద్రనగర్ మండల విద్యాశాఖ అధికారి శంకర్ రాథోడ్ మాట్లాడుతూ..మత్తు పదార్థాలకు యువత అలవాటు పడకుండా ఉంటేనే తమ భవిష్యత్తు బాగుంటుందని, బాగా చదువుకోవాలని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం మధుబన్ కాలనీ చౌరస్తాలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సత్య కుమార్, విశ్వనాథ్ రెడ్డి, ట్రెస్మా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి భీమ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, జిల్లా కోశాధికారి మల్లెల శ్రీనివాస్ రెడ్డి, రాజేంద్రనగర్ మండల ప్రధాన కార్యదర్శి బాబురావు, ఎస్ హెచ్ కాన్సెప్ట్ స్కూల్, నారాయణ హై స్కూల్, కాకతీయ హై స్కూల్, భవిష్య హై స్కూల్, విజేత స్కూల్, రాఘవేంద్ర హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## బీజేఎంసీలో పారిశుద్ధ్య నిర్వాహణ ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యం

**కార్పోరేషన్ కమిషనర్ శరత్ చంద్ర**




**గండిపేట్, : సూర్య ప్రతినిధి** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో పారిశుద్ధ్య నిర్వాహణలో ప్రజలను భాగస్వాములను చేయడమే తమ ప్రధాన ఉద్దేశ్యమని కార్పోరేషన్ కమిషనర్ శరత్ చంద్ర అన్నారు. శుక్రవారం కమీషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ ఆదేశాల మేరకు వంద రోజుల ప్రణాళికలో భాగంగా కార్పోరేషన్ పరిధిలోని 4వ డివిజన్ ఫోర్ట్ వ్యూ అపార్ట్మెంట్ లో తడి చెత్త, పొడి చెత్త, హానికారక చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కార్యక్రమం, 2 వ డివిజన్ గాయత్రీనగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించారు, హిమగిరినగర్ కాలనీలో దోమల లార్వా ఎదుగుదలను నియంత్రించేందుకు ఆయిల్ బాల్స్ వేశారు. 3 వ డివిజన్ మాధవినగర్ లో నిర్మిస్తున్న నూతన సీసీ రోడ్డు పనులను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ శరత్ చంద్ర మాట్లాడుతూ.. ప్రజలను పారిశుద్ధ్య నిర్వాహణలో భాగస్వాములను చేస్తేనే పారిశుద్ధ్య నిర్వాహణ పూర్తి స్థాయిలో సాధ్యమవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జీ.యాదయ్య, ఏఈఈ వీ.రాజ్‌కుమార్, ఐసీ ఎస్ఐజీ వెంకట్ రెడ్డి, వార్డు అధికారి డి.మధుసూదన్, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్స్పెక్టర్లు, శానిటరీ జవాన్లు సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టణాభివృద్ధి కి కృషి చేస్తా

## మున్సిపల్ కమిషనర్ జి.రవీందర్

**కోరుట్ల :** పట్టణ ప్రజల సహాకారాలతో కోరుట్ల పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని నూతన భాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ జి. రవీందర్ అన్నారు. ఇటీవల కోరుట్ల కమిషనర్ మారుతి ప్రసాద్ మంచిర్యాల కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం రవీందర్ కు కోరుట్ల మున్సిపల్ కమిషనర్ గా నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. మున్సిపల్ అధికారులు కమిషనర్ ను పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మున్సిపల్ పరిధిలో నీరు, విధి దీపాలు, పారిశుద్ధ్య సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తానని, మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి సాయశక్తులకు కృషి చేస్తానని ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిపిఎస్ ప్రవీణ్, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, ఎన్రోల్మెంట్ ఇంజనీర్ మహేష్, సాయంత్రం ఇన్స్పెక్టర్ రాజేందర్ అశోక్, మెప్మా టిఎంసి శ్రీరామ్ గౌడ్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

## ప్రభుత్వ పాఠశాలలో

## మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలి

**కోరుట్ల :** పట్టణంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ రఫీ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.. శుక్రవారం ఆయన పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాలను స్థానిక ఎంపీడీవో రామకృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అబ్దుల్ రఫీ మాట్లాడుతూ ఈ పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు టాయిలెట్స్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, మధ్యాహ్న భోజనం చేసేందుకు కిచెన్ తోపాటు డైనింగ్ హాల్ ను నిర్మాణం చేయించాలని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు అందించాలని విన్నవించారు.

# ‘కన్నప్ప’ మూవీ హిట్టా? ఫట్టా?




**టైటిల్ :** కన్నప్ప
**నటీనటులు:** విష్ణు మంచు, మోహన్ బాబు, మోహన్‌లాల్, ప్రభాస్, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్, ప్రీతి ముకుందన్, శరత్ కుమార్, బ్రహ్మానందం తదితరులు
**నిర్మాణ సంస్థ:** ఏవీఏ ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ
**నిర్మాత:** మోహన్ బాబు
**కథ:** పరుచూరి గోపాల కృష్ణ,ఈశ్వర్ రెడ్డి, జి. నాగేశ్వర రెడ్డి తోట ప్రసాద్
**దర్శకత్వం:** ముకేశ్ కుమార్ సింగ్
**సంగీతం :** స్టీఫెన్ దేవస్సీ
**సినిమాటోగ్రఫీ:** షెల్డన్ చౌ
**ఎడిటర్:** ఆంథోనీ
**విడుదల తేది:** జూన్ 27, 2025

కన్నప్ప.. మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కింది. ఈ చిత్రంలో ఆయన ప్రధాన పాత్ర పోషించడంతో పాటు కథకుడిగా, నిర్మాతగాను వ్యవహరించాడు. మంచు ఫ్యామిలికి చెందిన మూడు తరాలు ఈ చిత్రంలో నటించాయి. అలాగే ప్రభాస్, మోహన్ లాల్, అక్షయ్ కుమార్ లాంటి అగ్ర నటులు కీలక పాత్రలు పోషించడంతో ఈ చిత్రంపై ఆసక్తి పెరిగింది. ఇక టీజర్, ట్రైలర్ వచ్చాక ఈ సినిమాపై ఉన్న నెగెటివిటీ తగ్గిపోయింది. ప్రమోషన్స్ గట్టిగా చేయడంతో హైప్ క్రియేట్ అయింది. భారీ అంచనాల మధ్య నేడు(జూన్ 27) ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఎలా ఉందో రివ్యూలో చూద్దాం

**కథేంటంటే..**

తిన్నడు(మంచు విష్ణు) పరమ నాస్తికుడు. అతని తండ్రి నాథ నాథుడు(శరత్ కుమార్) మాటే ఆయనకు వేదం. గూడెం ప్రజలకే ఏ కష్టం వచ్చినా ముందుంటాడు. పక్క గూడానికి చెందిన యువరాణి నెమలి(ప్రీతీ ముకుందన్)తో ప్రేమలో పడతాడు. ఓసారి గూడెంలో ఉన్న వాయు లింగం కోసం వచ్చిన కాల ముఖుడు (అర్పిత్ రాంకా) సైన్యంతో తిన్నడు యుద్ధం చేస్తాడు. ఈ విషయం కాల ముఖుడికి తెలిసి.. గూడెంపై దండయాత్రకు బయలుదేరుతాడు. అదే సమయంలో ఓ కారణంగా తిన్నడు గూడాన్ని వీడాల్సి వస్తుంది. నెమలితో కలిసి అడవికి వెళ్తాడు. శివుడి పరమభక్తురాలైన నెమలి.. దేవుడినే నమ్మని తిన్నడు కలిసి జీవితం ఎలా సాగించాడు? వీరి జీవితంలోకి రుద్ర(ప్రభాస్) ఎందుకు వచ్చాడు? శివరాత్రి రోజు ఏం జరిగింది? వాయు లింగం కోసం కాల ముఖుడు ఎందుకు వెతుకుతున్నాడు? పరమ నాస్తికుడైన తిన్నడు చివరకు శివుడు పరమ భక్తుడు కన్నప్పగా ఎలా మారాడు? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

**ఎలా ఉందంటే..**

కన్నప్ప కథ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. పరమ నాస్తికుడైన తిన్నడు పరమ భక్తుడిగా ఎలా మారాడు అనేది 50 ఏళ్ల క్రితమే కృష్ణం రాజు ‘భక్త కన్నప్ప’ చిత్రం ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించారు. అదే కథతో ఇప్పుడు మంచు విష్ణు ‘కన్నప్ప’ చిత్రాన్ని తీర్చిదిద్దాడు. ఓ భక్తి కథకు కావాల్సినంత కమర్షియల్ ఎలిమెంట్స్ యాడ్ ను నేటి తరానికి నచ్చేలా ‘కన్నప్ప’ కథను చెప్పాలనుకున్నారు. ఈ విషయంలో మంచు విష్ణుని అభినందించాల్సిందే. అయితే టెక్నికల్‌గా సినిమాలో చాలా లోపాలు ఉన్నాయి. సీజీ వర్క్ పేలవంగా ఉంది. వార్ సీన్స్ కూడా అంతగా ఆకట్టుకోలేకపోయింది. అయితే ఎమోషన్‌ని తెరపై బాగా పండించి ఆ లోపాలను కాస్త కప్పిపుచ్చారు. భావోద్వేగ సన్నివేశాలను దర్శకుడు బాగా హ్యాండిల్ చేశాడు. ముఖ్యంగా చివరి 40 నిమిషాలు సినిమా చాలా ఎమోషనల్‌గా సాగుతూ.. శివ భక్తులను విపరీతంగా ఆకట్టుకుంటుంది.

శివుడు గొప్పతనాన్ని పాట రూపంలో చెబుతూ కథను ప్రారంభించాడు దర్శకుడు. ఆ తర్వాత తిన్నడు ఎందుకు నాస్తికుడిగా మారాల్సి వచ్చిందో అర్థవంతంగా చూపించారు. మంచు విష్ణు ఎంట్రీ కథనం ఆసక్తి పెరుగుతుంది. యువరాణి నెమలితో ప్రేమలో పడడం.. వీరిద్దరి మధ్య వచ్చే సన్నివేశాలు యూత్‌ని ఆకట్టుకుంటాయి. పాటల పేరుతో భక్తి చిత్రంలోనూ శృంగార రసాన్ని బాగానే పండించారు. కొన్ని చోట్ల ఆ శృంగార రసం మితిమీరిపోయింది కూడా.

ఇక మోహన్ బాబు ఎంట్రీ, మోహన్ లాల్ ఎంట్రీ సీన్స్ అదిరిపోతాయి. అయితే ఫస్టాఫ్‌లో వచ్చే యుద్ధ సన్నివేశాలు మాత్రం అంతగా ఆకట్టుకోలేదనే చెప్పాలి. ఓవరాల్‌గా ఫస్టాఫ్ పర్లేదులే అన్నట్లుగా సాగుతుంది. ఇక సెకండాఫ్‌లో కథనం పరుగులు పెడుతుంది. ముఖ్యంగా రుద్రగా ప్రభాస్ ఎంట్రి ఇచ్చిన తర్వాత కథనం మరింత ఆసక్తికరంగా సాగుతుంది. ప్రభాస్ కనిపించేది 20 నిమిషాలే అయినా.. ప్రేక్షకులు అలా చూస్తూ ఉండిపోతారు. క్లైమాక్స్‌లో విష్ణు నటన ఆకట్టుకుంటుంది. శివ భక్తులకు చివరి 40 నిమిషాలు అయితే విపరీతంగా నచ్చుతుంది.

**ఎవరెలా చేశారంటే..**

తిన్నడు అలియాస్ కన్నప్పగా మంచు విష్ణు బాగా నటించాడు. ముఖ్యంగా సెకండాఫ్‌లో విష్ణు నటన అదిరిపోతుంది. ఆయన కెరీర్‌లో బెస్ట్ ఫెర్పార్మెన్స్‌గా కన్నప్ప నిలిచిపోతుంది.

గూడెపు యువరాణి, శివుడి పరమ భక్తురాలు నెమలిగా ప్రీతి ముకుందన్ మంచి నటనతో ఆకట్టుకుంది. తెరపై కావాల్సినంత అందాలను ప్రదర్శిస్తూనే.. నటన పరంగాను మంచి మార్కులే సంపాదించుకుంది. విష్ణు, ప్రీతీల మధ్య కెమిస్ట్రీ బాగా వర్కౌట్ అయింది.

ఇక రుద్రగా ప్రభాస్ తనదైన నటనతో సినిమా స్థాయిని పెంచేశాడు. తెరపై కనిపించేది 20 నిమిషాలే అయినా.. అవే సినిమాకు కీలకంగా మారుతాయి. తిన్నడు, నెమలితో పాటు మహాదేవ శాస్త్రీ పాత్రలకు రుద్రకు మధ్య వచ్చే సీన్స్ అదిరిపోతాయి. ఆయన చెప్పే డైలాగ్స్ థియేటర్స్‌లో విజిల్స్ వేయిస్తాయి.

ఇక శివుడికి తనకంటే గొప్ప భక్తుడు లేడని భావించే మహాదేవ శాస్త్రీగా మోహన్‌బాబు తనదైన నటనతో ఆకట్టుకున్నాడు. ఆయన డైలాగు డెలివరీ ఆ పాత్రకు హుందాతనం తెచ్చింది.

మోహన్‌లాల్ తెరపై కనిపించేది కాసేపే అయినా.. ఆ సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. శివుడి పాత్రలో అక్షయ్ కుమార్, పార్వతీదేవి పాత్రలో కాజల్ ఒదిగిపోయారు.

ఇక తిన్నడు తండ్రిగా శరత్‌కుమార్ నటన బాగుంది. కానీ, ఓన్ వాయిస్‌తో చెప్పిన డబ్బింగ్ బాగోలేదు. చిన్నప్పటి తిన్నడుగా నటించిన అవ్రామ్.. నటన పరంగా ఓకే కానీ డబ్బింగ్ దారుణంగా ఉంది. తెలుగు పదాలు సరిగా పలకలేకపోయాడు. బ్రహానందం, మధుబాల, శివబాలాజీతో పాటు మిగిలిన నటీనటులు తమ పాత్రల పరిధిమేర నటించారు.

సాకేంతికంగా సినిమా బాగుంది. స్టీఫెన్ దేవస్సీ పాటలు పర్వాలేదు కానీ నేపథ్య సంగీతమే అంతగా బాగోలేదు. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలను గుర్తు చేసేలా బీజీఎం ఉంది. షెల్డన్ చౌ సినిమాటోగ్రఫీ అద్భుతంగా ఉంది. న్యూజిలాండ్ అందాలను తెరపై చక్కగా చూపించాడు. ఆర్ట్ డిపార్ట్‌మెంట్ పనితీరు బాగుంది. ఎడిటింగ్ ఓకే. నిర్మాణ విలువలు సినిమా స్థాయికి తగ్గట్లు ఉన్నతంగా ఉన్నాయి.

## నిధి అగర్వాల్ వింత అలవాటు.. రాత్రిళ్లు అవి చూడాల్సిందేనట!



సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే టాలీవుడ్ హీరోయిన్లలో నిధి అగర్వాల్ ఒకరు. సినిమాలకు సంబంధించిన అప్డేట్స్‌తో పాటు, తన గ్లామరస్ ఫోటోషూట్స్‌తో తరచూ నెట్టింట్లో హల్‌చల్ చేస్తూ ఉంటుంది. అంతేకాక, అభిమానులతో చిట్‌చాట్ చేసి ఇంట్రెస్టింగ్ విషయాలను షేర్ చేయడంలోనూ నిధి ముందుంటుంది. తాజాగా, ప్రతి రోజు రాత్రి తానే చేసే ఒక ఆసక్తికర విషయాన్ని అభిమానులతో పంచుకుంది. రాత్రి సమయంలో నాకు ఒక మర్డర్ మిస్టరీ సినిమా లేదా వెబ్ సిరీస్ చూడడం అలవాటుగా మారింది. కానీ ఇప్పుడు కొత్త కంటెంట్ దొరకడం లేదు. దయచేసి నాకు మంచి మర్డర్ మిస్టరీలు సజెస్ట్ చేయండి. ఏ భాష అయినా సరే! అని నిధి తన ట్వీట్ ద్వారా ఫ్యాన్స్‌ను కోరింది. నిధి ట్వీట్ కు నెటిజన్ల నుంచి ఆశించినంత రెస్పాన్స్ వచ్చిందనే చెప్పాలి. కానీ చాలా మంది కాస్త సెటైరిక్ మూడ్‌లోనే ఆమెకి రిప్లై ఇచ్చారు. రాధే శ్యామ్, బ్రహ్మోత్సవం,ఆచార్య , అజ్ఞాతవాసి సినిమాలు మర్డర్ మిస్టరీలే అంటూ కామెంట్ చేశారు. ఇక “హరి హర వీరమల్లు” సినిమా ఇప్పటివరకు విడుదల కాకపోవడం కూడా మర్డర్ మిస్టరీ అయిపోయిందని ఓ అభిమాని ఫన్నీగా స్పందించాడు. మరికొందరు “ఆదిపురుష్”, “ఫ్యామిలీ స్టార్”, “శక్తి”, “స్పైడర్”, “వరుడు”, “భోళా శంకర్” వంటి సినిమాల పేర్లను మర్డర్ మిస్టరీలు అంటూ సజెస్ట్ చేశారు. ఇక మేఘాలయ హనీమూన్ కేసు, తేజేశ్వర్ మర్డర్ కేసులాంటివి అసలైన మర్డర్ మిస్టరీలని, వాటి గురించి తెలుసుకోమంటూ కొందరు సలహాల ఇచ్చారు. ఇస్మార్ట్ శంకర్ చిత్రంతో మంచి క్రేజ్ తెచ్చుకున్న నిధి అగర్వాల్ ప్రస్తుతం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న హరి హర వీరమల్లు చిత్రంలో కథానాయికగా నటిస్తుంది. అలానే రెబల్ స్టార్ ప్రభాస్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న ది రాజా సాబ్ సినిమాల్లో కూడా హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ రెండు సినిమాలు పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలతో తెరకెక్కుతున్నాయి.హరి హర వీరమల్లు సినిమా జూలై 24, 2025న విడుదలకు సిద్ధమవుతుండగా, ది రాజా సాబ్ మూవీ డిసెంబర్ 5, 2025న థియేటర్లలోకి రానుంది. ఈ రెండు సినిమాల తర్వాత తన కెరీర్ మరో మలుపు తిరుగుతుందన్న ఆశాభావం నిధిలో కనిపిస్తోంది.




## వారియర్‌గా రష్మిక మందన్నా

2018లో “ఛలో” తో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన రష్మిక మందన్న ఇప్పుడు పాన్ ఇండియా హీరోయిన్‌గా సత్త చాటుతున్నారు. పుష్ప, యానిమల్, ఛావా సినిమాలతో పాటు రీసెంట్‌గా ‘కుబేర’తో బాక్సాఫీస్ వద్ద మెప్పించారు. కిల్లర్ లుక్స్‌తో ఇటు యూత్ ఐకాన్‌గా, అటు దర్శక నిర్మతాల బెస్ట్ ఆప్షన్‌గా ఆమె మారిందని చెప్పవచ్చు. వరుస చిత్రాలలో తన అద్భుతమైన నటనతో రష్మిక అగ్ర నటిగా నిలదొక్కుకున్నారు. స్టార్ హీరోయిన్ స్టేటస్ దక్కించుకున్నారు. ఇప్పుడు ఆమె మరో ఆసక్తికర ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించారు. త్వరలో ‘మైసా’ అనే సినిమాతో వస్తున్నట్లు ఒక పోస్టర్‌తో ప్రకటించారు. అందులో రష్మిక భయంకరమైన అవతారంలో కనిపించి సినిమాపై ఆసక్తి పెంచారు. పాన్ ఇండియా రేంజ్‌లో రవీంద్ర పూలే దర్శకత్వం వహిస్తున్నారు. తాను గతంలో ఎప్పుడూ పోషించని పాత్రతో ‘మైసా’ కోసం చేస్తున్నట్లు రష్మిక చెప్పారు. అభిమానుల కోసం ఎప్పుడు కూడా కొత్తగా, భిన్నంగా ఉన్న పాత్రలే చేయాలనేది తన ఉద్దేశం అంటూ పేర్కొన్నారు. ఇది ఆరంభం మాత్రమే అంటూ మైసా పోస్టర్‌ను రష్మిక షేర్ చేశారు. ఇప్పటి వరకు రష్మికను శ్రీవల్లి, గీతాంజలిగా చూసిన ప్రేక్షకులు త్వరలో ఒక వారియర్‌గా ఆమెను చూడనున్నారు. భారీ బడ్జెట్‌తో ఈ మూవీని అన్ ఫార్ములా ఫిల్మ్స్ నిర్మిస్తోంది. మరిన్ని విషయాలు త్వరలో ప్రకటించనున్నారు.

## ఎన్టీఆర్- త్రివిక్రమ్ ప్రాజెక్ట్‌పై పెరిగిపోతున్న అంచనాలు



యంగ్ టైగర్ ఎన్టీఆర్ ప్రస్తుతం సినిమాల పరంగా దూసుకుపోతున్నాడు. చివరిగా దేవర పార్ట్ 1 చిత్రంతో సందడి చేసిన తారక్, మరి కొద్ది రోజులలో వార్ 2 చిత్రంతో పలకరించబోతున్నాడు. ఈ సినిమాతో బాలీవుడ్ మార్కెట్‌లో కూడా తన హవా కొనసాగించనున్నాడు. హృతిక్ రోషన్‌తో కలిసి చేస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ ఆగష్టు 15న విడుదల కానుండగా, ఫ్యాన్స్ మూవీపై ఓ రేంజ్‌లో ఎక్స్‌పెక్టేషన్స్ పెట్టుకున్నారు. మరోవైపు తారక్ ..మాస్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాతో మాస్ ట్రీట్ పక్కా రానుందని అంటున్నారు. ఇక జూనియర్ ఎన్టీఆర్.. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో ఓ భారీ మైథాలజికల్ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు ఫిల్మ్ నగర్‌లో జోరుగా ప్రచారం నడుస్తుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందబోయే ఈ సినిమాకి సంబంధించిన కథపై ఇప్పటికే చర్చలు జోరుగా సాగుతున్నాయి. నిర్మాత నాగ వంశీ ఇటీవల ఇచ్చిన హింట్ ప్రకారం, ఈ కథ ఓ పౌరాణిక శక్తిరూపం అయిన సుబ్రహ్మణ్య స్వామి ఆధారంగా ఉండబోతుందనే వార్తలు వినిపిస్తున్నాయి. కుమారస్వామి, కార్తికేయ, మురుగన్ అని పిలిచినా అది ఆ ఒక్క దేవత రూపమే. అయితే త్రివిక్రమ్ ఈ పౌరాణిక అంశాన్ని ఎలా స్క్రీన్ పై ఆవిష్కరించబోతున్నారు? స్కంద పురాణం నుంచి ఎలాంటి సంఘటనలను కథలో మిళితం చేయబోతున్నారు? అన్నది సినీ ప్రేమికుల్లో ఆసక్తిని రేపుతోంది. తారక్ – త్రివిక్రమ్ మూవీ ఈ ఏడాది ప్రారంభమవుతుందనే ఊహాగానాలు వినిపించినా, తాజా సమాచారం ప్రకారం ఇది 2026కి వాయిదా పడే అవకాశం ఉంది. ఈలోగా తారక్ ప్రశాంత్ నీల్ సినిమా పూర్తి చేస్తే, త్రివిక్రమ్ కూడా విక్టరీ వెంకటేష్ తో ఒక మూవీ పూర్తి చేయనున్నట్టు సమాచారం.తారక్ అంటేనే అన్ని రకాల పాత్రలను అవలీలగా చేయగల సత్తా ఉన్న నటుడు. ముఖ్యంగా పౌరాణిక పాత్రల్లో తన వేషధారణ, డైలాగ్ డెలివరీ తో అదరగొడతాడు. అలాంటి తారక్‌తో త్రివిక్రమ్ చేస్తోన్న ఈ సినిమా అతని కెరీర్‌లో

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.